కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ సోమవారం 3 ఫిబ్రవరి 2025
సంపుటి: 14, సంచిక: 305 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత బన్నీ



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. రెండు నెలలుగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్స గురించి బన్నీ వాసు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసు కెళ్తామని చెప్పారు. శ్రీతేజ్ ..మిగతా 2లో



## తిరుపతి తొక్కిసలాటపై విచారణ

హాజరైన టీటీడీ ఈవో, జిల్లా ఎస్పీ 2

## ఈ నెల 15 తరువాత...
# పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

పంచాయతీ ఎన్నికలపై పొంగులేటి కీలక వ్యాఖ్యలు
ఎన్నికల ప్రక్రియ ముగిశాక భూ భారతి
ఒక నెలలో సాదాబైనామాల పరిష్కారానికి అవకాశం
రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇండ్లు ఇచ్చిన వారికి ఇప్పుడు ఇవ్వలేము
ఖరీఫ్‌లో మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ కు ఆదేశం
విప్పలమడకలో మేడా రాణి కుటుంబ సభ్యులను పరామర్శించిన పొంగులేటి

2



## అండర్-19 మహిళల...
## ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత్

త్రిష లాంటి క్రీడాకారులు
తెలంగాణకు గర్వ కారణం
సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలు చుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు సీఎం ..మిగతా 2లో



## కేసీఆర్‌ది హిస్టరీ...
# రేవంత్ రెడ్డి లాటరీ

రేవంత్‌రెడ్డి సర్కారు హనీమూన్ ముగిసింది
రుణమాఫీ పూర్తయినట్లు నిరూపిస్తే
రాజకీయాల నుంచి వైదొలగుతా: కేటీఆర్

పరిగి ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): రేవంత్‌రెడ్డి సర్కారు హనీమూన్ కాలం ముగిసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం దాస్యానాయక్ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటైన అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ శనివారం ఆవిష్కరించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే.. తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని సవాల్ విసిరారు. సీఎం సొంతూరికి లేదా పరిగి ఎమ్మెల్యే స్వగ్రామం శివారెడ్డిపల్లికి వస్తా.. అమలు చేసిన హామీలు చూపించాలని డిమాండ్ చేశారు. 'మీరు (సీఎం) వచ్చినా రాకపోయినా కొడంగల్‌కు దండయాత్రగా వెళ్తాం. కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికే లేదు. కేసీఆర్ అంటే ఒక హిస్టరీ.. రేవంత్ అంటే ఒక లాటరీ. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరుంటుంది. సమయం వచ్చినపుడు కేసీఆర్ బయటకు వస్తారు. 71 ఏళ్ల కేసీఆర్‌ను కర్రసాయం లేకుండా అసెంబ్లీకి రమ్మంటున్నారు. మీకు దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ ..మిగతా 2లో

## కేంద్రంపై పోరుకు బీఆర్ఎస్‌ను
# ఆహ్వానించిన కాంగ్రెస్

### బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేంద్రంతో యుద్ధానికి కలసి రండి



- రాజకీయాలకు అతీతంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు కాంగ్రెస్ పిలుపు
- కేంద్ర సాయంపై వినతులకు స్పందించని కేంద్రం
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్
- కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి
- ట్యాంక్ బండ్ వద్ద జరిగిన నిరసనలో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): కేంద్ర బడ్జెట్‌లో తెలంగా ణకు అన్యాయం జరిగిందని ఆరో పిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టిం ది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో ..మిగతా 2లో



వసంత పంచమి వేళ...
## ఆరు కోట్ల మంది వస్తారని అంచనా

2

కుంభమేళాకు 20 రోజుల్లోనే 33 కోట్ల మంది రాక
5న ప్రయాగ్‌రాజ్‌కు ప్రధాని మోదీ

## కుల గణనపై మంత్రివర్గ ఉప సంఘం భేటీ

ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన నివేదిక
వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతామన్న ఉత్తమ్
తెలంగాణలో ఎస్సీల జనాభా 17.43 శాతం
ఎస్టీల జనాభా 10.45 శాతం మంది
రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం
రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
మంత్రి ఉత్తమ్ కుమార్ అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశం



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై కేబినెట్ సబ్ కమిటీకి(మంత్రివర్గ ఉపసంఘం) నివేదిక అందజేశారు. కులగణనపై ..మిగతా 2లో



## అమెరికా యాక్షన్..
## కెనడా, మెక్సికో రియాక్షన్

దేశాల మధ్య సుంకాల యుద్ధం 2

## గచ్చిబౌలి కాల్పుల ఘటనలో...
## మోస్ట్ వాంటెడ్ క్రిమినల్
# ప్రభాకర్

2

ప్రభాకర్‌ను విచారిస్తున్న సీసీఎస్, ఎస్వోటీ క్రైమ్ బృందాలు
ప్రభాకర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 80 కేసులు

## షర్మిలతో విజయసాయి భేటీ?

ఏపీ రాజకీయాలలో చర్చనీయాంశమైన వ్యవహారం

హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్): ఏపీ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల నుంచి తప్పుకొని వ్యవసాయం చేస్తానని ప్రకటించిన విజయసాయిరెడ్డి ..మిగతా 2లో



## కేఎల్ వర్సిటీపై సీబీఐ కేసు

ఏ++ గుర్తింపు కోసం న్యాక్ బృందానికి లంచాలు
న్యాక్ బృందంలోని 10 మంది అరెస్టు
దేశవ్యాప్తంగా 20 చోట్ల తనిఖీలు
లంచంగా ఇచ్చిన సొత్తు స్వాధీనం




2

కలం నిఘా



# అమెరికా యాక్షన్.. కెనడా, మెక్సికో రియాక్షన్

**వాషింగ్టన్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** అగ్రరాజ్యం అమెరికాకు కెనడా, మెక్సికో దేశాలతో సుంకాల యుద్ధం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం సుంకాలు విధించారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంపై కెనడా, మెక్సికో దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తునట్లు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో కూడా అలాంటి ఆదేశాలే జారీ చేసింది. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నామని, ట్రంప్ చర్యలకు ఇది ప్రతిస్పందన అని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యానించారు. 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం ఈ మంగళవారం నుంచే అమల్లోకి వస్తుందని, మిగిలిన టారిఫ్‌లు 21 రోజుల తర్వాత అమలవుతాయని చెప్పారు. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని ట్రంప్ అనుకుంటే తమతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలని, అదే వారికి మంచిదని పేర్కొన్నారు. మెక్సికో కూడా కెనడా బాటలోనే నడుస్తోందని, తాము కూడా అమెరికా దిగుమతులపై సుంకాలు విధిస్తామని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో మెక్సికో ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం 4 నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందని, దాదాపు పదివేల మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. మెక్సికో ఎల్లప్పుడూ పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుందే తప్ప ఘర్షణను కాదని అన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే అందుకు కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అధిక సుంకాలు విధిస్తే సమస్యలు పరిష్కారం కావని క్లాడియా వ్యాఖ్యానించారు. మెక్సికన్ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ప్లాన్-బీని అమలు చేయాలని ఆర్థిక కార్యదర్శిని ఆదేశిస్తున్నానని షేన్‌బామ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. మరోవైపు చైనాపై సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా నిర్ణయాన్ని సవాలు చేస్తామని ప్రకటించింది. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివారం తీసుకున్న నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## తిరుపతి తొక్కిసలాటపై విచారణ

**హాజరైన టీటీడీ ఈవో,జిల్లా ఎస్పీ**

**తిరుమల ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్ల జారీలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ ముగిసింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తితో పాటు పలువురు సభ్యులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తిరుపతి కలెక్టరేట్‌లో విచారణ జరిపింది. టీటీడీ ఈవో శ్యామలరావు, పలువురు పోలీస్ అధికారులను కమిటీ విచారించింది. జ్యుడీషియల్ ఎంక్వయిరీలో భాగంగా మూడు రోజులుగా తిరుపతిలో కమిటీ పర్యటించింది. నగరంలోని తొక్కిసలాట జరిగిన పద్మావతి పార్క్, రామానాయుడు పబ్లిక్ స్కూల్ ప్రాంతాలను శనివారం పరిశీలించి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకుంది. ఎనిమిది ప్రాంతాల్లో ఏకాదశి టికెట్లు మంజూరు చేసిన విధానంపై ఆరా తీసింది. విచారణ నేపథ్యంలో కమిటీ పలు దస్త్రాలను సేకరించింది. త్వరలోనే ప్రభుత్వానికి కమిటీ నివేదిక అందజేయనుంది.

## కేసీఆర్‌ది హిస్టరీ... రేవంత్ రెడ్డి లాటరీ

మొదటి పేజీ తరువాయి...

లేకుండా లగచర్లకు రావాలి. తులం బంగారం, స్కూటీలు, ఉపకార వేతనాలు, రైతుబంధు, ఇవేవీ అమలు కాలేదు. చివరకు సఫాయి సిబ్బందికి కూడా వేతనాలు పడటం లేదు. భారాస పాలనలో పదేళ్లపాటు అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు తీసుకువెళ్లాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని జైలుకు పంపింది. ప్రజల కోసం చేసే పోరాటంలో కేసులకు భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. లగచర్ల కేసులో బెయిల్‌పై విడుదలైన సురేష్, గోపాల్‌నాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బాల్కసుమన్, పార్టీ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కుల గణనపై మంత్రివర్గ ఉప సంఘం భేటీ

మొదటి పేజీ తరువాయి...

మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామని ఆయన వెల్లడించారు.

**96.9శాతం మంది వివరాలందించారు.**

స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోందని, అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని వివరించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని తెలిపారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలను అందించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదని తెలిపారు.

**కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతాం**

ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతారని ఆయన వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

**కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు**

తెలంగాణ రాష్ట్రంలోని 3,54,77,554 మంది వివరాల నమోదు.

మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు చేశారు.

కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం మంది.

కులగణన సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం మంది

కులగణన సర్వే ప్రకారం తెలంగాణలో ఎస్సీల జనాభా 17.43 శాతం

ఎస్టీల జనాభా 10.45 శాతం మంది

రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం మంది

రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08 శాతం మంది

ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా '56.33 శాతం

రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం

రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం

రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం.

## ఈ నెల 15 తరువాత... పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

**ఖమ్మం ఫిబ్రవరి 2(నిఘా న్యూస్):** పంచాయతీ ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ నెల 15 తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడకలో ఆదివారం రాత్రి ఇటీవల చెందిన మేడా రాణి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.మేడా రాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కొంతమంది కాంగ్రెస్ నాయకులు సాదాబైనామా, ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు అలాగే ఖరీఫ్లో మిగిలిపోయిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.దీంతో వెంటనే జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో మంత్రి పొంగులేటి ఫోన్ చేసి ఖరీఫ్లో మిగిలిపోయిన రైతులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు.అదే సమయంలో పుణ్యపురం గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు పెండింగ్లో ఉన్న సాదాబైనామా గురించి ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు.వెంటనే మంత్రి స్పందించి సాదాబైనామా పరిష్కారానికి కేవలం ఒక్క నెల గడువు మాత్రమే ఇస్తామని అది కూడా ఈనెల 15న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎన్నికల ప్రక్రియ ముగిశాక భూ భారతిలో ఒక నెలలో సాదాబైనామాల




పరిష్కారానికి అవకాశం ఇస్తామని,ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు.అలాగే రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన వారికి ఇప్పుడు కేటాయించబోమని, పేదలకు మాత్రమే మొదటి ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి కాల్పుల ఘటనలో... మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ప్రభాకర్

**ప్రభాకర్‌ను విచారిస్తున్న సీసీఎస్, ఎస్‌వోటీ క్రైమ్ బృందాలు**

**ప్రభాకర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 80 కేసులు**

**హైదరాబాద్ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో కలకలం సృష్టించిన కాల్పుల ఘటన కేసులో విచారణ కొనసాగుతోంది. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్‌రెడ్డిని శనివారమే అరెస్టు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. సీసీఎస్, ఎస్‌వోటీ క్రైమ్ బృందాలు నిందితుడి నుంచి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే నిందితుడి నుంచి రెండు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని బిహార్ నుంచి కొనుగోలు చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు ప్రభాకర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 80 వరకూ చోరీ కేసులు ఉన్నాయి.

**ఇంతకీ ఏం జరిగిందంటే...**

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ పాత నేరస్థుడు. 2022 మార్చి నెలలో విచారణ నిమిత్తం అనకాపల్లి కోర్టుకు తీసుకెళ్లిన సమయంలో తప్పించుకుపోయాడు. అప్పటినుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, నార్సింగి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చోరీలు చేశాడు. కాగా నిందితుడు ఎక్కువగా ఇంజినీరింగ్ కాలేజీల్లో చోరీ చేస్తుంటాడు. ప్రవేశాలు, పరీక్షలు, హాస్టల్ ఫీజు డబ్బులు కళాశాలల్లో ఉంటాయని పక్కా పథకంతో చోరీలు చేస్తాడు. ఇటీవల నార్సింగి, మొయినాబాద్‌లో జరిగినటువంటి చోరీల్లో వేలిముద్రల్ని విశ్లేషించగా ప్రభాకర్ వేలిముద్రలతో సరిపోలాయి. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు దోపిడీ చేసిన డబ్బుతో వీకెండ్స్‌లో పబ్‌కు వెళ్తున్నట్లుగా సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఐటీ కారిడార్‌లోని పబ్‌ల సిబ్బంది, బౌన్సర్లకు నిందితుడికి సంబంధించిన ఫొటోలిచ్చి ఆచూకీ తెలిస్తే




సమాచారమివ్వాలని సూచించారు.ప్రభాకర్ శనివారం సాయంత్రం 7.10 గంటల సమయంలో గచ్చిబౌలిలో ఉన్నటువంటి ప్రిజం పబ్ దగ్గర ప్రత్యక్షమయ్యాడు. గుర్తించిన బౌన్సర్లు పబ్‌ను 7.30 గంటలకు తెరుస్తారని అప్పటివరకూ ఎదురుచూడాలని అతడికి చెప్పారు. మద్యం సేవించి ఉన్న నిందితుడు ఫోన్ ఛార్జర్ అడగ్గా ఇచ్చారు. పక్కకు వెళ్లి ఛార్జింగ్ పెట్టుకునే సమయంలో పోలీసులకు నిందితుడి గురించి సమాచారమిచ్చారు.7.30 గంటల సమయంలో సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు ప్రదీప్‌రెడ్డి, వీరస్వామి మఫ్టీలో వచ్చారు. నిందితుడిని పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించేలోపు అతడు తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డి పాదం నుంచి ఒక తూటా దూసుకెళ్లడంతో గాయపడ్డాడు. ఉలిక్కిపడ్డ సహచర కానిస్టేబుళ్లు బౌన్సర్ల సాయంతో నిందితుడిని అడ్డుకుని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కేఎల్ వర్సిటీపై సీబీఐ కేసు

**ఏ++ గుర్తింపు కోసం న్యాక్ బృందానికి లంచాలు**

**న్యాక్ బృందంలోని 10 మంది అరెస్టు**

**దేశవ్యాప్తంగా 20 చోట్ల తనిఖీలు**

**లంచంగా ఇచ్చిన సొత్తు స్వాధీనం**

**అమరావతి ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్)** గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి 'ఏ ౦౦' గుర్తింపు పొందేందుకు న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చిన ఆ సంస్థ యాజమాన్యంపైన, తీసుకున్న సభ్యులపైనా సీబీఐ కేసు నమోదు చేసింది. మొత్తం 14 మందిని నిందితులుగా చేర్చింది. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్ఈఎఫ్) ప్రెసిడెంట్, ఇతర ప్రతినిధులతోపాటు న్యాక్ తనిఖీ బృందంలోని మొత్తం 10 మంది సభ్యులను నిందితులుగా పేర్కొంది. 10 మందిని అరెస్టూ చేసింది. కేఎల్‌యూ యాజమాన్య ప్రతినిధులతో పాటు దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లూ ఇందులో ఉండటం సంచలనం సృష్టించింది. దిల్లీ, విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీఐ బృందాలు. విజయవాడ గవర్నర్‌పేటలోని కేఎల్‌యూ పరిపాలన భవనం, వడ్డేశ్వరంలోని క్యాంపస్‌లో సోదాలు చేపట్టాయి.

**నగదు, బంగారం రూపంలో లంచాలు**

న్యాక్ బృందం 3 రోజులుగా వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ ప్రమాణాలను పరిశీలిస్తోంది. 'ఏ౦౦' రేటింగ్ కోసం యూనివర్సిటీ యాజమాన్యం నగదు, బంగారం, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల రూపంలో న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చింది. దీనిపై సీబీఐకి ఫిర్యాదులు అందడంతో, కేసు నమోదు చేసి, వెంటనే రంగంలోకి దిగింది. ఆఘమేఘాలపై దిల్లీ నుంచి వచ్చిన బృందాలు తనిఖీలు చేపట్టాయి. చెన్నై, బెంగళూరు, విజయవాడ, పాలము, సంబల్‌పూర్, భోపాల్, బిలాస్‌పూర్, గౌతమ్ బుద్ధనగర్, న్యూదిల్లీలోని 20 చోట్ల న్యాక్ బృంద సభ్యుల నివాసాలు, కార్యాలయాల్లో శనివారం ఏకకాలంలో సోదాలు చేశాయి. రూ.37 లక్షల నగదు, 6 ల్యాప్‌టాప్‌లు, ఒక ఐ ఫోన్ 16 ప్రో. స్వాధీనం చేసుకున్నాయి.

**అరెస్టయిన వారిలో కేఎల్‌యూ యాజమాన్య ప్రతినిధులు**

జి.పి.సారథి వర్మ,

కోనేరు రాజ హరీన్, ఎ.రామకృష్ణ ఉన్నారు.

న్యాక్ బృందంలో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను సైతం అరెస్టు చేశారు.

## వసంత పంచమి వేళ... ఆరు కోట్ల మంది వస్తారని అంచనా

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం, సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది. జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా, ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90 లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6 కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా, ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

**అమెరికా జనాభాతో సమానంగా యాత్రికులు**

మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు అశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు. అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్‌లను పరిశీలించిన ఆయన, స్నానాల తర్వాత ఘాట్‌ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్‌ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లలో ప్రకటనలు చేశారు. ఇదిలా ఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.



## అండర్-19 మహిళల... ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత్

మొదటి పేజీ తరువాయి...

అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా జట్టు విశ్వవిజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అద్భుత ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వకారణమని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

## షర్మిలతో విజయసాయి భేటీ?

మొదటి పేజీ తరువాయి...

ఏపీ కాంగ్రెస్ ఛీఫ్ వైఎస్ షర్మిలతో మూడు రోజుల క్రితం సీక్రెట్‌గా సమావేశమైనట్లు తెలుస్తోంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న విజయసాయి రెడ్డి, షర్మిలను కలిశారనే విషయం ఇప్పుడు వైసీపీలో కలకలం రేపింది. మూడు రోజుల క్రితం విజయసాయిరెడ్డి హైదరాబాద్ వెళ్లి లోటస్‌పాండ్ లోని షర్మిలను సీక్రెట్‌గా కలిశారని విశ్వసనీయంగా తెలిసింది. దాదాపు మూడు గంటల పాటు రాజకీయ అంశాలపై వారిద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారని సమాచారం. అంతేకాదు మధ్యాహ్నం భోజనం కూడా షర్మిల ఇంట్లోనే చేశారని తెలుస్తోంది. ఎంత సీక్రెట్‌గా వీళ్ల భేటీ జరిగినప్పటికీ ఏదోలా ఈ విషయం ఇప్పుడు బయటకు పొక్కింది. దీంతో ఏపీ రాజకీయాల్లో ఏం జరుగుతుందని వైసీపీ శ్రేణులతో పాటు మిగతా పార్టీలు ఆశ్చర్యపోయి చూస్తున్నాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి. అన్ని వేళలా ఆయనకు అండగా ఉన్నారు. గతంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం తలెత్తినప్పుడు కూడా జగన్‌కు మద్దతిస్తూ షర్మిలతో విభేధించారు. అది కాకుండా వైఎస్ వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారని విజయసాయి చేసిన ప్రకటనపైనా అభ్యంతరం తెలిపారు. వైఎస్ వివేకా హత్య కేసులో నిజాలు బయట పెట్టాలని కూడా షర్మిల సూచించారు. షర్మిలపై విజయసాయి కూడా పలు సందర్భాల్లో విమర్శలు చేశారు. ఇలా ముందు నుంచి విభేధాలతో ఉన్న వీరు ఇప్పుడు భేటీ అవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చలకు తావిస్తోంది.

## శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత బన్నీ

మొదటి పేజీ తరువాయి...

వైద్య ఖర్చులు భరిస్తామని తెలిపారు. తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్ దాదాపు రెండు నెలలుగా ఆసుపత్రికే పరిమితమయ్యాడు. అయినా బాలుడి ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. తొక్కిసలాట తర్వాత బాలుడిని పక్కకు తీసుకెళ్లిన పోలీసులు సీపీఆర్ చేశారు. వెంటనే సికింద్రాబాద్ కిమ్స్‌కు తరలించారు. కొన్ని రోజులపాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సొంతంగా ఆక్సిజన్ పీల్చుకోవడంతో వెంటిలేటర్‌ను తొలగించి ప్రత్యేక గదికి మార్చారు. అప్పటి నుంచి అతను ఆసుపత్రిలో మంచానికే పరిమితమయ్యాడు. పేరుపెట్టి పిలిచినా కళ్లు తెరిచి చూడలేదు. నోరు విప్పి మాట్లాడలేదు. ఇప్పటివరకు ముక్కు వద్ద అమర్చిన సన్నని గొట్టం ద్వారానే లిక్విడ్ ఆహారం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ చేపడుతున్నారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. ఎప్పుడు కోలుకుంటాడో వైద్యులు కూడా చెప్పలేని పరిస్థితి. శరీరంలో ఇతర జీవ ప్రక్రియలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ శ్రీతేజ్ నుంచి స్థిరమైన ప్రతిస్పందనలు ఉండటం లేదని వైద్యులు చెబుతున్నారు.

## కేంద్రంపై పోరుకు బీఆర్ఎస్‌ను ఆహ్వానించిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహ రిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా ఐదు శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంపై పోరాటానికి భారాస కలిసి రావాలని మహేశ్ కుమార్‌గౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు నిరసనలో పాల్గొన్నారు.


# తెలంగాణలో బిజెపికి గుణపాఠం తప్పదు

- బిజెపి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- హాజరైన మాజీ టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నే జీవన్ రెడ్డి



**షాద్ నగర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** అంత అన్నారు. ఇంతన్నారు. అంతలోనే ముంచేశారు. బడ్జెట్ పేరిట తెలంగాణ ప్రజల చెవిలో కమలం పూలు పెట్టారు.. ఇదేం తీరు ఈ ప్రభుత్వాలు ఉంటేనే బడ్జెట్ ఇస్తారా మీరు అధికారంలో ఉంటేనే అన్నీ చేస్తారా దీనికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, తెగ మాట్లాడే డీకే అరుణ సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విరుచుకుపడ్డారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేసినప్పటికీ వాటికి తుంగలో తొక్కి బడ్జెట్లో తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విడిపోయిన సమయంలో చేసుకున్న ఒప్పందాలను కూడా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి ఉపాధి హామీ కూలీలు ఎంతో కాలంగా తమ శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని ఎదురు చూస్తుండగా వారికి బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉండగా గతంలో కంటే తక్కువ నేతలు కేటాయించి నిరుపేదలపై తమకున్న అక్కసును చాటుకున్నారని ధ్వజమెత్తారు. వారి ఆశలను పూర్తిగా అడియాస చేశారని, బడుగు బలహీన వర్గాలకు పూర్తిగా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇది కేవలం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న బడ్జెట్ గా కనిపించిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఏందిరా రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఇలాంటి కక్ష సాధింపులు సరికాదని అన్నారు. ఆధిపత్యమే లక్ష్యమా..? చిన్న రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచి వారిపై ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ఆరోపించారు. గొప్ప గొప్ప మాటలు చెప్పే బండి సంజయ్, కిషన్ రెడ్డి, డీకే అరుణ లాంటి నాయకులు ఇప్పుడు ఏమి సమాధానం చెప్తారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు ఇక్కడ ఎంపీ ఎన్నికలలో బిజెపిని నమ్మి 8 సీట్లు ఇస్తే వారి కొంపముంచారని అన్నారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారని త్వరలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అత్యధికంగా పన్నుల రూపేనా కేంద్రానికి వెళుతున్నాయని, కానీ సంక్షేమం విషయంలో బిజెపి పక్షపాత ధోరణితో వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చారని, భవిష్యత్తులో కేంద్ర సహకారం లేకున్నా అభివృద్ధి చేయగలరని పేర్కొన్నారు. కానీ బిజెపి తన వైఖరి మార్చుకోకపోతే ప్రజలు తరిమికొట్టడం ఖాయమని అన్నారు. నిరుపేదలకు పక్కా ఇళ్లకు ఒక్క రూపాయి కూడా చెల్లించని కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు అనే పేరును తొలగించాలని పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలో చదువుకున్న యువతి యువకులలో నైపుణ్యాలు పెంచి ఈ పారిశ్రామిక ప్రాంతంలో ఉద్యోగాల కల్పనకు తమ వంతు కృషి చేస్తానని ఎంఎస్ఎన్ పరిశ్రమ అధినేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాలు పెంచే విషయంలో తమ సంస్థ కీలకపాత్ర పోషిస్తుందని, అదేవిధంగా షాద్ నగర్ అభివృద్ధి విషయంలోనూ కీలక పాత్ర పోషిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని, ప్రత్యేక సమావేశాలు పెట్టుకున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఇది కొంతమంది ప్రతిపక్షాలు సామాజిక మాధ్యమాలలో చేస్తున్న దుష్ప్రచారమని తిప్పి కొట్టారు. సమస్యలు చర్చించుకోవడం, వాటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లడం పాలనలో భాగమేనని, కాంగ్రెస్ ఆ స్వతంత్రం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ,మాజీ టిటిడి బోర్డు మెంబర్ మన్నే జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, వెంకటరామిరెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, రఘు, బాలరాజ్ గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అత్తా మామల వేధింపులతో వివాహిత ఆత్మహత్య



**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి చిలుకా నగర్ లో వరకట్న వేధింపులతో ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సీతారాంపురం గ్రామం, గుండాల మండలం, యాదాద్రి జిల్లాకు చెందిన మలిపెద్ది రవళి (25)కి, పాటిమట్ల గ్రామం, మోత్కూరు మండలం యాదాద్రి జిల్లాకు చెందిన బోరెడ్డి రాజశేఖర్ రెడ్డి తో 2019లో వివాహం జరిగింది. కొద్ది రోజులు పఠాన్ చెరువు, కొద్ది రోజులు ఉప్పల్ లో ఆ తరువాత, ఉప్పల్ లోని చిలుకా నగర్ లో నివాసం ఉంటూ ఇద్దరు ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవినం కొనసాగిస్తున్నారు .వీటికి సాత్విక (5) పునర్విక (3) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెళ్ళైన మూడు నెలల నుండే భర్త, అత్త, మామ, ఆడిబిడ్డ వేధింపులు రవళికి ఎక్కువయ్యాయి. సంవత్సరం క్రితం చిలుకా నగర్ లోనే భార్య ఇద్దరు పిల్లలను వదిలేసి రాజశేఖర్ రెడ్డి వెళ్ళిపోయాడు. కనీసం పిల్లలకు ఆధార్ కార్డు లేని పరిస్థితి. బిటెక్ చదివిన రవళి చిలుకా నగర్ లోని స్కూల్లో టీచర్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. భర్త వదిలేసి వెళ్లిపోవడం పిల్లలకు ఆధార్ కార్డు లేని కారణంగా స్కూల్లో పిల్లలకు అడ్మిషన్ లభించక పోవడంతో పిల్లలను భర్త వద్ద వదిలేసి రావడం జరిగింది. భర్త సంవత్సర కాలం నుండి వదిలేసి వెళ్లిపోవడమే కాక అత్త మామ భర్త నుండి వేధింపులు ఎక్కువ అయ్యాయి.రెండు రోజుల క్రితం నగరానికి ఓ ఫంక్షన్ కి వచ్చిన భర్త, అత్తా మామ, అదే రోజు రాజశేఖర్ భార్య వద్దకు వెళ్లిరావడం, ఆ రాత్రే రవళి చనిపోవడం పలు అనుమానాలకు దారి తీసింది.భర్త, అత్త, మామ, ఫంక్షన్ కి వచ్చి వేధింపులు చేయడంతో రవళి శనివారం రవళి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని బందువులు ఆరోపిస్తున్నారు.రవళి డెడ్ బాడీ ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీలో ఉంది. రవళి డెడ్ బాడీని చూడటానికి భర్త, అత్త, మామ, ఆడిబిడ్డలు రాలేదు. భర్త అత్త మామ ఆడబిడ్డల వేధింపుల వల్లనే రవళి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతురాలి భర్త రాజశేఖర్ రెడ్డిని, అత్త, మామలను పోలీస్ స్టేషన్ కి రావాలని పిలిచినా రెండు రోజులుగా రాని పరిస్థితి. రవళి మరణానికి కారణమైన భర్త, అత్త మామ ఆడబిడ్డపై చర్యలు చేపట్టాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

**ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.అనిల**



**తాండూరు, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యను అందించడం జరుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.అనిల వెల్లడించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనిల ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేస్తూ విషయాల వారీగా సంబంధిత ఉపాధ్యాయులు నాణ్యతతో కూడిన విద్య అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. పదో తరగతిలో మొత్తం 65 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి గ్రూపులుగా విభజించి పాఠ్యాంశాలను బోధిస్తున్నామని అన్నారు. ఏరోజు ఏ పాఠ్యాంశాన్ని బోధిస్తున్నామో అదే పాఠ్యాంశం నుండి ప్రశ్న పత్రాన్ని తయారుచేసి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఎనిమిది మంది విద్యార్థులకు ఒక గ్రూపుగా ఏర్పాటుచేసి ఒక గ్రూపు విద్యార్థులకు కు ఒక ఉపాధ్యాయులు దత్తతగా తీసుకొని విద్యను బోధించడం జరుగుతుందని వివరించారు. విషయాల వారిగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి పరీక్షలకు సన్నద్ధం చేయడం జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం ప్రత్యేక తరగతులకు సంసిద్ధం చేసి, పాఠశాలకు పంపించాలని, పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ అనిల కోరారు.

## రైతు బీమాలా.. కూలీ భీమా ప్రవేశ పెట్టాలి



- ఉపాధి హామీ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తున్న కేంద్రం
- పనిదినాలను 100 నుండి 200 రోజులకు పెంచాలి
- రోజుకు 600 రూపాయల వేతనాన్ని చెల్లించాలి
- డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్

**హనుమకొండ, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఉపాధి హామీ కూలీలకు పనివద్ద ప్రమాద భీమాను రెండు లక్షల నుండి 10 లక్షలకు పెంచాలని, ఉపాధి హామీ కూలీలకు, భూమి కలిగిన వ్యవసాయ కూలీలకు ఇచ్చే రైతు భీమా మాదిరిగా ఉపాధి హామీ కూలీకి కూలీ భీమా ప్రవేశపెట్టాలని,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ షరతును ఎత్తివేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ 19 వ గ్రామీణ ఉపాధి హామీ కూలీల దినోత్సవ ప్రారంభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 740 జిల్లాలలో 7,86,927 గ్రామాలలో 14.55 కోట్ల ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన కుటుంబాలుంటే పనికి వెళ్ళేవారికి సంఖ్యపరంగా చూసుకుంటే 3లక్షల కొట్లు అవసరముంటే 2024బి25 బడ్జేట్ లో కేటాయించిన మాదిరిగానే 2025బి26 బడ్జేట్ లో 86 కోట్లకు మించి పెంచకపోవటం పట్ల కూలీల పట్ల కేంద్రం సంవత్సరానికింత అన్యాయం చేస్తు సంవత్సరానికి ప్రతి కూలీ కుటుంబానికి 100 రోజుల పనిదినాలకు గాను కేవలం 41 రొజులు మాత్రమే కల్పిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో 20 రొజులు పనిచేసిన కుటుంబాలకు మత్రమే భరోసా ఇస్తామనే నిబంధనలను తీసివేయాలని, దిని వలన తక్కువ కుటుంబాలు మత్రమే అర్హత సాదించే అవకాశ ముందన్నారు. కనుక కూలీలకు ఉపాధి హామీ షరతును ఎత్తివేయాలని, కూలీలకు ప్రస్తూతం అమలుచేస్తున్న రెండు లక్షల ప్రమాద భీమాను 10 లక్షలకు పెంచాలని, ఉపాధి హామీ కూలీకి 600 వేతనాన్ని ఇవ్వాలని,పని కల్పించలేని పరిస్థితిలో కూలీలకు నిరుద్యోగ భృతి చెల్లించాలని,ఉపాధి హామీ కార్డులను తొలగించకుండా ఉపాధి హామీని కూలీలకు హక్కుగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకురాలు బౌతు రాధ,బౌతు భాగ్య,అడేపు రమాదేవి, ఉపాధి హామీ కూలీలు లక్ష్మి, వసంత, నిర్మల, మల్లేషం, కనుకయ్య, సంధ్య,ప్రమీల, రాజు, తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట సెంటర్ లో గల హెచ్ పెట్రోల్ బంక్ పక్కన విజయవాడ వారి మామ్స్ కిచెన్ బిర్యానీ హోటల్ ను జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, మారిశెట్టి రాధ, బచ్చుల సుధీర్, మండపాక అప్పన్న దొర, రాయి సాయి, మందుల షాప్ ప్రకాష్, సాంబత్తుల చంద్రశేఖర్, గారపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

*-జగ్గంపేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):*

## న్యూ నంది హిల్స్ మిడిల్ కాలనీ నూతన కార్యవర్గం



**బాలాపూర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ న్యూ నంది హిల్స్ ఫేస్ 1 మిడిల్ కాలనీ అసోసియేషన్ 3, 4,5, 6ల కమిటీల ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మిడిల్ కాలనీ అసోసియేషన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అభివృద్ధియే ఎజెండాగా ఏర్పడిన ఈ కమిటీ కి ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని తెలియజేశారు. కమిటీ నిర్వహణ గౌరవాధ్యక్షులు ఏం సూర్యనారాయణ అధ్యక్షులు చల్లా శేఖర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సిహెచ్ రఘునాథ రెడ్డి కోశాధికారి డి ఆంజనేయులు ఉపాధ్యక్షులు ఏ జానయ్య పటేల్, గిరిధర్, ఎం రవీంద్ర ముదిరాజ్ సహాయ కార్యదర్శులుగా మోహనా చారి, ఎల్ రవికిరణ్, పురుషోత్తం గౌరవ సలహాదారులు సామ భాస్కర్ రెడ్డి, జే బాలరాజు, రఘుకుమార్ రెడ్డి కూప్ సింగ్, కే నరసింహారెడ్డి కార్యవర్గ సభ్యులుగా పి.గోవింద్, రాందేవ్, శివరాజ్, నరేష్, రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉప్పల్ శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు





**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం కల్పతరు మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ శిష్య బృందం కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. గణేశా పంచరత్న, అన్నయ్య కీర్తనలు, భజన, త్యాగరాజ కృతులు లను నీరజాక్షి, కీర్తన, పూజ వైష్ణవి, మయూఖ, తులసి, జస్మితా, రవిక, సుశాంత్ మొదలైన వారు కీర్తనలను ఆలపించారు. గణేశా కౌతం, పుష్పాంజలి, చక్కని తల్లికి, అష్టలక్ష్మి , గరుడ గమన, రాధే గోవిందా, తరంగం, ఓంకార రూప, కళింగ నర్తన అంశాలను షణ్ముఖి, పృథ్వీక, శాన్వి, శర్మదా, అక్షర, సంజన, సాహితి, అనూష, హిమబిందు, హిమవర్షిత, మహిత, దర్శిని, చార్వి మొదలైన వారు ప్రదర్శించారు.

## దివ్యాంగులకు నెలవారి సరుకులు అందజేత

**158 నెలలుగా హెల్పింగ్ హాండ్స్ చేయూత**



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి పట్టణంలో హెల్పింగ్ హాండ్ సంస్థ 158 వ నెల దివ్యాంగులకు ఇచ్చే నెల సరుకులకు రాయలసీమ కాలేజ్ అధినేత సుబ్బరామిరెడ్డి దివ్యాంగులకు అందజేశారు. రాయలసీమ కాలేజ్ అధినేత మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సభ్యులందరూ స్నేహితులని,తన సహాయం వారికి ఎల్లవేళలా ఉంటుందని అదే విధంగా ప్రతి సంవత్సరం ఇద్దరు పిల్లలకు హెల్పింగ్ సంస్థ ద్వారా వస్తే, వారికి ఫీజులో రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాయ్ సభ్యులు గరికపాటి రమేష్ బాబు, గుమ్మల రాజేశ్వరరావు కోళ్ల రవి,బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పోత్నాక్ ప్రమోద్ కుమార్ సతీమణి కీ.శే. పోత్నక్ రోజా దశదిన కర్మ లో భువనగిరి మాజీ ఏమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో కలిసి నివాళులర్పించిన భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

*-భువనగిరి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):*

## ఇది ప్రజా బడ్జెట్, మిడిల్ క్లాస్ బడ్జెట్

**కొత్త పరిశ్రమలు ప్రారంభించే మహిళ ఎస్సీ ఎస్టీ లకు రెండు కోట్ల లోన్**



**షాద్ నగర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** కేంద్ర బడ్జెట్, ప్రజా బడ్జెట్ మిడిల్ క్లాస్ బడ్జెట్ అని బీజేపీ యువ నాయకులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ బడ్జెట్ దేశ స్థితి గతినే మార్చే విధంగా ఉన్నదని ఇది మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రవేశ పెట్టడం గర్వకారణమని వారు అన్నారు. 12 లక్షల వరకు నో ఇన్ కం టాక్స్ ఇది చాలా పెద్ద నిర్ణయమని 2027 అమెరికా చైనా తర్వాత భారత్‌ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం ప్రతిపక్షాలు బిజెపి ఎదుగుదల చూసి ఓర్వలేకనే బడ్జెట్ పై కామెంట్ చేస్తున్నారని వారు అన్నారు. ఎస్సీ ఎస్టీ లు మొదటిసారి పరిశ్రమలు ప్రారంభించేవారికి 2 కోట్ల రుణం అందిచడం పేద వర్గాలను ఉన్నత వర్గాలగా తీర్చిదిద్దటానికి చేస్తున్న గొప్ప పరిణామం అని అన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో వసంత పంచమి ఏర్పాట్లు



**బాలాపూర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా ఆలయంలో కొలువై యున్న శ్రీ సరస్వతి అమ్మవారికి ఉదయం 4.30 కు ప్రత్యేక అభిషేకము, అలంకరణ అనంతరం అర్చనలు జరుగుతాయని ఓ ప్రకటనలో ఆలయ ఈఓ.ఎన్.లావణ్యతెలిపారు. అనంతరం ఎనిమిది గంటలకు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసంలు, అన్నప్రాసనలు నిర్వహించబడుతాయని, ఈ కార్యక్రమాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని అన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రసాదాలు మంచినీరు అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు.

## విలేకరులకు ప్రమాద బీమా

**ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్**



**ఇల్లందు , ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నికరోజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ర వీ ం ద ర్ యాదవ్ ప్రెస్ క్లబ్ లో ఉన్నటువంటి 35 మందికి రెండు లక్షల ప్రమాద బీమా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతోటి విలేకరులకు ఏ ఆపద వచ్చినా వెన్నంటే ఉంటానని అన్నారు.

## సంతాప సభలో ఇల్లందు మాజీ వైస్ నివాళులు



**ఇల్లందు, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలోని 22వ వార్డు మున్సిపల్ కార్యాలయంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న విక్రమ్ స్వగృహంలో దుర్గమ్మ అమ్మవారిని పెట్టుకోవడము జరగగా, దుర్గమ్మవారి ఆశీస్సులు తీసుకొని అమ్మవారి కార్యక్రమంలో పాల్గొన్నారు. అలానే 17 వ వార్డులో బాలసాని సుభాష్ గౌడ్ సంతాప సభలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి వారి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మడత వెంకట్ గౌడ్. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు భాస శ్రీనివాస్, తులసిరాం గౌడ్, సత్యనారాయణ, శ్రీను బాబు గౌడ్, సత్యం, బాబు జానీ ఏక్తా హౌస్ టీం సభ్యులు కాంగ్రెస్ నాయకులు నందకిషోర్, సుభాష్ గౌడ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేయి గొంతులు లక్ష డప్పులు పోస్టర్ ఆవిష్కరణ



**ముస్తాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్మెట రాజు మాదిగ ఆధ్వర్యంలో వేయి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మెట రాజు మాదిగ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై ఫిబ్రవరి 7న హైదరాబాద్ మహానగరంలో తలపెట్టిన వేయి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామము నుండి ప్రతి ఒక్కరూ డప్పులతో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య గౌరవ అధ్యక్షుడు సుంచు మల్లన్న గౌరవ సలహాదారులు ముక్క మల్లయ్య కొల్లూరి నాగరాజు కొమ్మెట మోహన్ జోగెల్లి నాగరాజు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల బుచ్చయ్య జ ప్రశాంత్ బిక్షపతి దేవయ్య దుర్గయ్య సర్వని శ్రీనివాస్ కృష్ణ హరిప్రసాద్ శ్రీకాంత్ శ్రీనివాస్ వెంకటేష్ నవీన్ నరసయ్య బాలరాజు సాయి నరేష్ నవీన్ పరశురాములు వివిధ గ్రామాల శాఖ కమిటీలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై బిజెపి వివరణ ఇవ్వాలి

### కాంగ్రెస్ మహా ధర్నాలో

### కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల




**షాద్ నగర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్లో నిధుల కేటాయింపులు చేయక పోవడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల పాల్గొన్నారు. ప్లకార్డు ప్రదర్శించి తెలంగాణకు కేంద్ర బడ్జెట్లో కేటాయింపులేవి అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధుల కేటాయింపులు అలసత్వం ప్రదర్శిస్తుందని విమర్శించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున, రాష్ట్రానికి నిధుల కేటాయింపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. రాష్ట్రం నుంచి జిఎస్టి రూపంలో అధిక నిధులు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం. ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న బడ్జెట్ లో ఎందుకు నిధులు కేటాయింపు చేయించలేక పోయారో తెలుపాలని డిమాండ్ చేశారు.

## హైడ్రో జియాలజిస్ట్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ




**వలిగొండ, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామానికి చెందిన భూగర్భ జలాల నిర్వహణ భూగర్భ జల శాస్త్రవేత్త నీలం సుమన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జల శాస్త్రవేత్త నీలం సమన్ మాట్లాడుతూ మన ఈ భూగ్రహం మీద మాత్రమే నీరు లభిస్తుందని ఘన ద్రవ, వాయు రూపంలో వివిధ రకాల రాళ్లలో దాగి ఉంటున్న భూగర్భ జలాలను వెలికి తీయాలంటే భూ భౌతిక పరీక్షలో అగ్ని శిలల్లో (గ్రానైట్ రాయి) లో 20 సంవత్సరాల అనుభవం కలిగి ఉన్న జల శాస్త్రవేత్త నీలం సుమన్ డిఆర్ డి ఎ నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తూ నీటి ఎద్దటి భూముల్లో నీటి లభ్యత ఎంతో లోతులో ఉన్నవి అనే అంశం మీద పరిశోధన చేసి ప్రజలకు సహాయ సహకారాలు చేసిన వ్యక్తి నీలం సుమన్.

# మాజీ కార్పొరేటర్ దివంగత నందరాజ్ గౌడ్ కు నివాళులు



**అంబర్ పేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఐఎస్ఐ ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురైన కర సేవకుడు మాజీ కార్పొరేటర్ దివంగత నందరాజ్ గౌడ్ 32వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం బాగ్ అంబర్ పేట లోని ఆయన నందరాజ్ గౌడ్ స్మారక స్థూపం వద్ద జరిగింది. అంబర్ పేట నియోజకవర్గం బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, కార్పొరేటర్లు ఉమ, అమృత, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్ గౌడ్ లు పాల్గొని నందరాజ్ గౌడ్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం బీజేపీ యువమోర్చా కన్వీనర్ సునీల్ ఆధ్వర్యంలో జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు



మాట్లాడుతూ షాహిద్ నందరాజ్ గౌడ్ చేసిన సేవలు,క్రమశిక్షణతో పార్టీకి పనిచేయ్యడం మనందరికీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. పార్టీ అభివృద్ధికి నందరాజ్ గౌడ్ చేసిన సేవలను గుర్తుచేస్తూ అనాడు జరిగిన అయోధ్య కర సేవలో ముందున్న వీర సైనికుడని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో షాహిద్ నంద రాజ్ గౌడ్ కలలుగన్న భవ్య దివ్యమైన అయోధ్య రామ మందిరం నిర్మాణం పూర్తి కావడంతో నందరాజ్ గౌడ్ ఆశయసాధన పూర్తయిందని, దీనితో ఆయన ఆత్మ శాంతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు రమేష్ యాదవ్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అజయ్ కుమార్, అంబర్ పేట అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రాజ్, జి.మల్లేష్, డివిజన్ బిజెపి అధ్యక్షులు చుక్కజగన్, నందరాజ్ గౌడ్ కుమారుడు, డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం.రోహిత్ నందరాజ్ గౌడ్, సతీమణి లలితా నంద రాజ్ గౌడ్ లు పాల్గొని నందరాజు గౌడ్ స్మారక సూపర్ వద్ద నివాళులర్పించారు.

## సూర్యా యూత్ ఆధ్వర్యంలో మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ ననావత్ రెడ్యా నాయక్, నాయకులకు ఘనంగా శాలువా కప్పి సన్మానాలు చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ యాదాద్రి ఆక్సిజన్ పార్క్ వద్ద సూర్యా యూత్ ఆధ్వర్యంలో పోచారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులకు ఐదు సంవత్సరాలు దిగ్విజయంగా పాలన సాగించి పదవి కాలము పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి పూల మొక్కలను ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సందర్భంగా మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో సూర్య యూత్ సభ్యులు, నాయకులు వెన్నంటే ఉండి సేవా కార్యక్రమంలో పాలుపంచుకున్నందుకూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మాజీ వైస్ చైర్మన్ ననావత్ రెడ్యా నాయక్ మాట్లాడుతూ సూర్య యూత్ సభ్యులు గ్రామంలో ఎలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టినా ముందుండి మాకు తోడు నీడగా ఉండి పని చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్ ను కూడా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ రైతు సహకార సంఘం డైరెక్టర్ బోయపల్లి సత్తిరెడ్డి, యంజాల భాస్కర్ గౌడ్, కెఎం రెడ్డి, జితేందర్ నాయక్, శివాజీ ముదిరాజ్, రామ్ రెడ్డి, ఆకిటి బాల్ రెడ్డి, శివాజీ అశోక్, అర్జున్ రెడ్డి, రమేష్, రాజేశ్వర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, లోకేష్ రెడ్డి, సంతోష్ నాయక్, నల్లవెల్లి మురళి, శ్రీధర్ గౌడ్, రాఘవేందర్, హరీష్, వినయ్, యశ్వంత్, భవాని శంకర్, సాయి, ప్రణాత్ రెడ్డి, హరి, శివా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మహాధర్నా లో పాల్గొన్న ఉప్పల్ నేతలు

### రాష్ట్రానికి మొండిచేయి చూపిన బీజేపీ

### టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్

**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** టీపీసీసీ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమనికి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజవర్గం నుండి కదలిన కాంగ్రెస్ నాయకులు, కేంద్ర బడ్జెట్ లో తెలంగాణపై వివక్ష చూపి నిధుల కేటాయింపులో అన్యాయం చేసినందుకు నిరసనగా ఆదివారం సాయంత్రం ట్యాంక్ బండ్ పై ఉన్న అంబేత్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,. సీతక్క ,రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే లు, చైర్మన్లు, కార్పొరేటర్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, ప్రశాంత్ రెడ్డి, సేవాదళ్ వెంకటేష్ నూతలకంటి రాజు, గద్ద క్రాంతి కిషోర్, నరేష్, బాలరాజు పూర్ణిమ



సుజాత లక్ష్మి, రాజశేఖర్, చందు నాయక్, జిత్తు,నక్క శివ, రఘు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల యువకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ హస్తం ప్రార్ధనా మందిరంలో రమాదేవికి సన్మానం





**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఘట్ కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ ఎఫ్ సి నగర్ లో ప్రేమ హస్తం ప్రార్ధన మందిరంలో మాజీ కౌన్సిలర్ కొమ్మ గోని రమాదేవి, మహిపాల్ లకు దార్ల విజయ్ ఎలిజబెత్ గార్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. రమాదేవి ఎన్ ఎఫ్ సి నగర్ కౌన్సిలర్ గా ఉన్నన్నాళ్ళు తమకు ఎంతో సేవ చేశారని ఆ సేవను మేము ఎప్పుడూ స్మరించుకుంటూ ఉంటామని వారు ప్రేమ హస్తం చర్చ్ లోకి ఆదివారం ఆహ్వానించి వారి దంపతుల క్షేమం కోసం యేసు నామములో ప్రార్ధనలు చేసి ఆశీర్వచనం చేశారు. అనంతరం వారికి పూల గుజ్జాలు చేతికి అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పదవీ కాలములో మా కాలనీలో ఎంతో అభివృద్ధి చేస్తూ, పిలిస్తే పలికారని, ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానంటూ మాకు ధైర్యాన్ని ఇచ్చి మాకు అండగా నిలిచిన కౌన్సిలర్ రమాదేవికి కృతజ్ఞతలని విజయ్ ఎలిజబెత్ అన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ నాకు పదవి ఉన్నా లేకున్నా నేను ఎప్పటికీ నీ సేవకురాలు నేనని ఆమె అన్నారు. మీకు ఎలాంటి సమస్య ఉన్న నేరుగా వచ్చి నాకు చెప్పవచ్చు నా శక్తి కొద్ది నేను మీకు సహాయపడతానని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాల పట్ల దృష్టి సారించి అర్హులైన లబ్ధిదారులు పథకాలను పొందాలని సూచించారు. నాయకులు వస్తుంటారు పోతుంటారు. ఎవరికీ పదవులు శాశ్వతం కాదు ప్రజల బాగోగులు చూసే మనసున్న నాయకులు ఉంటే ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా మున్సిపల్ ఆఫీస్ కార్యాలయానికి వెళ్లి మాట్లాడి పని చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గాయత్రీ మాత ఆలయ వార్షికోత్సవం



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో కొలువైన శ్రీ గాయత్రీ మాత ఆలయంలో ఘనంగా 19వ వార్షికోత్సవ పూజలు జరుగుతున్నాయి. ఈ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ వార్షికోత్సవ పూజాలల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అన్నోజిగూడ గ్రామంలో కొలువైన శ్రీ గాయత్రి మాత గ్రామ ప్రజలందరినీ ఎల్లవేళలా చల్లగా చూడాలని కోరుకుంటున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొంతం అంజిరెడ్డి, బోయపల్లి సత్తిరెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఆకిటి బాల్ రెడ్డి, బొక్క ప్రభాకర్ రెడ్డి, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, నల్లవెల్లి మురళి, రాట్లావత్ సంతోష్ నాయక్, కార్తీక్ పంతులు, కౌశిక్ అర్చక బృందం పాల్గొన్నారు.



## పిఎంసిలో సీఎం సహాయ నిధి అందజేత



**మేడిపల్లి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ వాసులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారుడు బి.రాంరెడ్డికి రూ.20,500 చెక్కును మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. లబ్ధిదారుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

### అధ్యక్షుడిగా రవీందర్ యాదవ్ ఎన్నిక



**ఇల్లందు, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఇల్లందు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ప్రెస్ క్లబ్ నందు నిర్వహించారు. అధ్యక్షుడిగా రవీందర్ యాదవ్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస చారి ఉపాధ్యక్షులుగా కడారి నటరాజ్, ఎస్.శశికుమార్ కార్యదర్శిగా జహారా భీ,సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్ మనోజ్ ప్రచార కార్యదర్శిగా షేక్ సలీం కోశాధికారిగా కాపు సురేష్ బాబు ప్రెస్ క్లబ్ ఇన్చార్జిగా పబ్బు శివను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుమన్ రెడ్డి వ్యవహరించారు. సుమన్ రెడ్డి, జర్నలిస్ట్ ఇంద్రారెడ్డి తోపాటు జర్నలిస్ట్ కపిల్ ఉన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## ఘంషీ భాయ్ చిత్రపటానికి ఘన నివాళులు

### శ్రద్ధాంజలి ఘటించిన మాజీ సర్పంచ్ నర్సింలు గౌడ్



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రియ శిష్యురాలైన ఘంషీ బాయ్ మరణించి నేటికి తొమ్మిది రోజులు ఆమె కుటుంబ సభ్యులు నిర్వహించిన పెద్దకర్మ లో పోచారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బాలగోని చిన్న నరసింహులు గౌడ్, మాజీ పంచాయతీ సభ్యులు కొంతం శంకర్ రెడ్డి, బోదాస్ వెంకటేష్ లు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండావాసులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి పోరాడి నాయకులకు న్యాయం చేకూర్చేదని ఆయన తెలిపారు. ఆమెతో సోదరీ సోదరుల అనుబంధం నాదని ఆయన కంటతడి పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కుటుంబ సభ్యులు వారి బంధువులు పాల్గొన్నారు.

## కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**వలిగొండ, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి ఫినిక్స్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 900 మంది కంటి పరిక్షలు చేయించుకున్నారు. వారిలో 243 మందిని తదుపరి చికిత్స కోసం హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుంభం కీర్తీ రెడ్డి, కుంభం రామ్ రెడ్డి వైద్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సెయింట్ మార్క్స్ పాఠశాల వార్షికోత్సవం



**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** ఉప్పల్ లోని సెయింట్ మార్క్స్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సమీర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, అన్ని రంగాల్లో రాణిచేందుకు తగు చేయూత అందిస్తున్నామన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు శారీరక, మానసికంగా మరింత చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బెల్లంకొండ లో పెన్షన్ల పంపిణీ

**బెల్లంకొండ, ఫిబ్రవరి 1 (నిఘా న్యూస్):** మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. తెల్లవారు జామునుండే సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు. వారికి ఇచ్చిన ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నేరుగా పెన్షన్ల అందించారు. ఈ క్రమంలో మండలంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగింది. శనివారం 96 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. ఇబ్బంది పడ్డ సచివాలయ సిబ్బంది శనివారం తలపెట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయా సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు గ్రామాలను కప్పేసిన పొగ మంచు, మరోవైపు సర్వర్ రాక ఇబ్బందులకు లోనయ్యారు.

## అక్రమంగా కలప తరలింపు



**నారాయణపేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజక వర్గంలోని ధన్వాడ ఊట్కూర్ కేంద్రాల నుండి అడవిలో వేప చెట్లు తుమ్మ చెట్లు నరికి రాత్రి వేళలో మక్తల్ కు తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమ కలప తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు మౌన వ్రతం పాటిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమ చెట్లను నరికే స్తున్న వారిని మీద నిఘా పెట్టవలసిన అవసరం ఉందని ప్రజలు విజ్ఞప్తి చేశారు.


## చైన్ స్నాచర్ అరెస్ట్



**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** రామంతాపూర్ వెంకటరెడ్డి నగర్ లో శుక్రవారం నాలుగున్నర తులాల బంగారం చోరీ అయిన సంఘటన అందరికి తెలిసిందే. వివరాల్లోకి వెళితే వెంకట్ రెడ్డి నగర్ లో బాధితురాలు అమృతమ్మ ఉంటున్న పక్క గల్లీలోనే బానోత్ మల్లికార్జున్ (19) ఫ్యామిలీతో ఉంటున్నాడు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. తరచూ అమృతమ్మ మనుమని దగ్గరకు వస్తుంటాడు. డబ్బు మీద ఆశ కలిగి ఏం చేయాలో తెలియక అమృతమ్మ పడుకున్న సమయం చూసి ఇంట్లోకి వెళ్లి మెడలో ఉన్న పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. పోలీసులకు సమాచారం తెలవగానే వెంటనే డిఐ రామలింగారెడ్డి, డీఎస్ఐ బుగ్గయ్య ఎస్సై మధు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుని పట్టుకొని బంగారాన్ని రికవరీ చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# బాక్స్ డ్రైన్ ల అభివృద్ధితో.. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

**మహేశ్వరం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబిల్ కాలనీలో జోరుగా నాలా పనులు జరుగుతున్నాయి. గత పది సంవత్సరాలు కాలంగా నబిల్ కాలనీ వాసులు నిరంతరం వెంటాడుతున్న ముంపు సమస్యతో ఆ కాలనీ వాసులంతా సతమతం అయ్యేవారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, నబిల్ కాలనీలో పర్యటించారు. వారి బాధలను కష్టాలను స్వయంగా చూసి ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా ఉంటానని ఆందోళన గురి కావద్దని అభయమిచ్చారు. అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ తో మాట్లాడి ఎస్ ఎన్ డి పి నిధుల నుంచి నిధులు తీసుకొచ్చారు. భవిష్యత్తులో ముంపు సమస్య లేకుండా గత వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎస్ ఎన్ డి పి అధికారులతో పలుమార్లు సమాలోచనలు చేశారు. ఓ ప్రణాళిక బద్ధంగా రూపొందించిన మ్యాప్ ని పరిశీలించి ఓకే చేశారు. నబిల్ కాలనీలో రూ.6.30 కోట్లతో నాలా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. భారీ వర్షాలు వచ్చినప్పుడు కాలనీలో రోడ్లపైకి, ఇంట్లోకి వరద నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే సబితా రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల సదరు కాంట్రాక్టర్ కొన్ని రోజులు పనులు నిలిపివేయడంతో మాత్రం పెండింగ్లో ఉంది. గత 2 నెల క్రితం నబిల్ కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటించి అదనంగా మరిన్ని కోట్లు నిధులు విడుదల చేయించి ఎమ్మెల్యే ఆదేశాలతో మళ్ళీ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. 2.5 వెడల్పు, 6 పీర్ల






పొడవుతో 215 మీటర్లు నాలా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. భవిష్యత్తులో ముంపు సమస్య రాదని నవీన్ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముంపు సమస్య త్వరలో పూర్తిగా తొలిగి పోతుందని చాలా సంతోషంగా ఉంది . ఇన్నాళ్లకు ముపు సమస్య తీరనుంది. ప్రతి సంవత్సరం వాన కాలంలో భయానిక పరిస్థితిలో ఉండే వాళ్ళం. వర్షం నీరు మురుగు నీరుతో కలిసి ప్రవహించడంతో దుర్గంధం వాసనతో దోమలతో ఇబ్బందులు పడ్డాము. చిన్నపిల్లలు వృద్ధులు ఇంటికే పరిమితమయ్యేవారు. కాలనీలు చెరువును తలపించేది. ప్రస్తుతం ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేయించడంతో కాలనీ వాసులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఉందని చెప్పగానే వచ్చి అధికారులతో మాట్లాడి పనులు చేయించే ఇటువంటి ఎమ్మెల్యేను గతంలో ఎన్నడూ చూడలేదు. ఎమ్మెల్యే సబితా రెడ్డి లేకుంటే మా పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉండేది. ఎంత పెద్ద సమస్యనైనా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యం, ఖైసర్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తలుచుకుంటే ఎంతటి సమస్య అయినా పరిష్కారం అవుతుంది. ఏదైనా సమస్య ఉంటే కాలనీ వాసులు ఆమెతో విన్నవించుకుంటే ఆమె క్షేత్రస్థాయిలో వచ్చి పరిశీలిస్తారు. సమస్య తెలుసుకొని వెంటనే అక్కడ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తారు. ఒకవేళ తీవ్రమైన సమస్య ఉంటే ఉన్నత అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయిస్తారు. ఆ సమస్యను మళ్ళీ లేకుండా చేస్తారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డ్రీమ్ సిటీ, గ్రీన్ సిటీ, తదితర కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ధన్యవాదాలు ముంపు సమస్య ఇక ఉండదు. అహ్మద్ కసాది ప్రతి సంవత్సరం కురుస్తున్న వర్షాలకు తన మూడో వార్డులోని కాలనీ బస్తీలలో నీరు చేరి ఇందులో నుంచి బయటికి వెళ్ళలేని పరిస్థితి ఉండేది వానకాలం వచ్చిందంటే రెండు నెలల పాటు ప్రజల తీవ్ర ఇబ్బందులు పడేవారు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి దృష్టి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే నిధులు కేటాయించారు .90 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగతా పది శాతం పనులు పూర్తయితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సబితా రెడ్డికి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుమల నగర్ లో అనుమతి లేని బోరు సీజ్

**అంబర్ పేట్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** గోల్నాక డివిజన్ లోని తిరుమల నగర్ కాలనీలో ఓ వ్యక్తి అనుమతి లేకుండా భారీ సైజ్ బోర్ వేస్తున్నట్లు కాలనీవాసులు అంబర్ పేట తహసిల్దార్ కి ఫిర్యాదు చేశారు. కాలనీవాసుల ఫిర్యాదు పై స్పందించిన తహసిల్దార్ వెంటనే రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి బోర్ ను సీజ్ చేసి చర్యలు తీసుకున్నారు. కాలనీవాసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమల నగర్ కాలనీలోని నవభారత్ ఎదురుగా ఉన్న 100 చదరపు గజాల ఖాళీ స్థలంలో ఓ ఇంటి యజమాని ఆదివారం సెలవు దినం రోజు రెవెన్యూ అనుమతి లేకుండా నిబంధనలు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా ఆరున్నర అంగుళాల బోర్ వేస్తున్నాడు. ఈ విషయమై కాలనీవాసులు తహసిల్దార్ వీరాబాయికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన తాసిల్దార్ వెంటనే రెవిన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి బోర్ ను సీజ్ చేశారు. రెవెన్యూ సిబ్బంది బోరు సీజ్ చేసినప్పటికీ బోరు వేసే వాహనం అక్కడే నిలిపి ఉండడం పట్ల కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును పూడ్చివేయాలని కాలనీ వాసులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కాలనీలో భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ విషయమై సోమవారం




తాసిల్దార్ వీరబాయిని కలిసిలిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

## ఘనంగా లక్ష్మమ్మ స్మారక విద్యాలయ వార్షికోత్సవం



**మేడ్చల్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** మేడ్చల్ పట్టణంలోని లక్ష్మమ్మ స్మారక విద్యాలయంలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులను పాఠశాల యాజమాన్యం శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని లక్ష్మమ్మ స్మారక విద్యాలయం క్రమశిక్షణకు మారుపేరు అని, ఇక్కడ విద్యను అభ్యసించిన ఎంతోమంది విదేశాలలో సైతం స్థిరపడ్డారని అన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు ఎల్లప్పుడు విద్యార్థుల ప్రతిభ పాటవాల్ని వెలికి తీసేందుకు సృజనాత్మకత పద్ధతిలో విద్యాబోధన కొనసాగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఎన్నో అరాచకాలు, వాటిని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని అన్నారు. అనంతరం పాపారాయ విద్యానికేతన్, లక్ష్మమ్మ విద్యార్థులకు బహుమతులను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, రాజేందర్, ప్రిన్సిపల్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీమిండియా ఘన విజయం పట్ల మాజీ ఎంపీ నామ హర్షం

### గొంగిడి త్రిష ప్రతిభ తెలంగాణకు గర్వ కారణం: మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా అద్భుతమైన విజయాన్ని సాధించడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. నామ ఆదివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ యువ క్రికెటర్లు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభ, క్రీడాస్ఫూర్తి దేశానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం వాసి గొంగిడి త్రిష అద్భుతంగా రాణించిందని, ఫైనల్ మ్యాచ్ లో 3 వికెట్స్ తీయడంతో పాటు 44 పరుగులు చేసిన ఆమె ప్రదర్శన మన తెలంగాణకు గర్వకారణమని నామ నాగేశ్వరరావు ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళా క్రికెట్‌ను మరింత ఎదిగించేందుకు త్రిష వంటి యువ క్రీడాకారిణులు ప్రేరణగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. భారత యువ మహిళా జట్టు వరుసగా రెండోసారి అండర్-19 వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకోవడం యువ క్రీడాకారిణుల అంకితభావం, కోచింగ్ స్టాఫ్ కృషి, బీసీసీఐ సహాయ సహకారాలు ప్రశంసనీయమని నామ పేర్కొన్నారు. ఈ ఘన విజయం భారత క్రికెట్ అభివృద్ధిలో మైలురాయిగా నిలిచిపోతుందని, మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు మరింతగా ముందుకు రావాలని సూచించారు. యువ క్రీడాకారిణులకు మెరుగైన వనరులు, శిక్షణ అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

## మందకృష్ణను కలిసిన మేడి ప్రియదర్శిని



**చిట్యాల, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి ప్రియదర్శిని ఆదివారం హైదరాబాద్లో మంద కృష్ణ మాదిగను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగకు అండగా ఉంటామని తెలిపారు.

## ఖోఖో జట్టు కోచ్ నరేష్ కు సన్మానం



**ధర్మపురి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం బంజేరుపల్లి తండా (బి) గ్రామానికి చెందిన ఇస్లావత్ నరేష్ నాయక్ ఇటీవల ప్రపంచ కప్ గెలిచిన జాతీయ మహిళల ఖోఖో జట్టుకు కోచ్ గా వ్యవహరించాడు. ఖోఖో లో ప్రపంచ కప్ గెలవడంతో ఖోఖో జట్టు కోచ్ గా వ్యవహరించిన ఇస్లావత్ నరేష్ నాయక్ కు సోషల్ మీడియాలో పలువురు బెస్ట్ కోచర్ గా ప్రశంసించారు. ఆదివారం రోజున తన స్వగ్రామం బంజేరుపల్లి తండా(బి)కు రావడంతో నరేష్ నాయక్ కు బంజారా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి బాదావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో పత్తిపాక క్రాస్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. బంజేరుపల్లి తండా (బి) గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలందరూ కలిసి ర్యాలీ నిర్వహించారు. బంజారా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి బాదావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో నరేష్ నాయక్ కు పూలమాలవేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, బానోత్ రాము నాయక్, కోశాధికారి ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్, ప్రకాష్ నాయక్, ప్రవీణ్, రవి నాయక్ ఏఎంసీ చైర్మన్ లావుడియ రూప్లా నాయక్ గ్రామ పెద్దలు శంకర్ నాయక్, రాజు నాయక్, ఇస్లావత్ రాజునాయక్, నరహరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చిక్కవరంలో సుందరయ్య రెడ్ వాలెంటీర్స్ శ్రమదానం



**గన్నవరం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** గన్నవరం మండలం, చిక్కవరం గ్రామం లోని ఆదివారం నాడు సుందరయ్య రెడ్ వాలెంటీర్స్, జయశ్రీ పాలిమర్స్ కార్మికులు కలిసి ఎలిమెంటరీ స్కూల్, చెరువు గట్టు పరిసర ప్రాంతాలను శ్రమదానం చేసి శుభ్రం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో చిక్కవరం గ్రామ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తమ సహాయ సహకారాలు అందించారు. సుందరయ్య రెడ్ వాలంటీర్లు మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లెం కోటయ్య, సి హెచ్, రాజేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, నాగరాజు, జయశ్రీ పాలిమర్స్ సంస్థ మేనేజరు, జనరల్ మేనేజరు, కార్మికులు తదితరులు పాల్గొని శ్రమ దాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

### ఫంగల్ ఇన్ఫెక్షన్ తో అప్రమత్తం..

# ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాజియా నౌషీన్ సిద్ధిఖా



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఫంగల్ అనేది సూక్ష్మజీవి అని ఇది తేమ, వేడిమి, చెమట, శరీర శుభ్రత లోపించినప్పుడు ఫంగల్ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుందని ఆసుపత్రి సూపరింటెండెంట్, చర్మ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ నాజియా నౌషీన్ సిద్ధిఖా వెల్లడించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం శ్రేయస్కరమని హితవు పలికారు. నగరంలోని నాంపల్లి ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, చర్మ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ నాజియా నౌషీన్ సిద్ధిఖా ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకడానికి కారణాలు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, రక్తహీనతతో ఉన్నవారికి, చిన్నారులకు, హెచ్ఐవి సోకిన బాధితులకు, దీర్ఘకాలిక రోగ గ్రస్తులకు, ఈ వ్యాధి సంక్రమించడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లక్షణాలు పేర్కొన్నారు. చర్మం పైన కొందరిలో తెల్లటి మచ్చలు, నల్లటి, ఎర్రటి మచ్చలు ఏర్పడతాయని, తదితర శరీర ప్రదేశాలలో దురద సైతం ప్రారంభమవుతుందని, తదితర లక్షణాలు తెలిపారు. పైన సూచించిన లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే, దురద ప్రభావం అధికమవుతుందని సూచించారు. అదేవిధంగా శరీరం మొత్తం మచ్చలు ఏర్పడడానికి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. నాంపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో చర్మ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి తాను అందుబాటులో ఉంటారని వెల్లడించారు. చర్మ వ్యాధి నివారణకు సంబంధించిన మాత్రలు, క్రీములు, ఔషధాలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. చర్మ వ్యాధి లక్షణాలు కనిపించినప్పుడు బాధితులు నేరుగా ఔషధాల దుకాణాలకు వెళ్లి స్టెరాయిడ్ మాత్రలు, క్రీములు కొనుగోలు చేసి వినియోగించరాదని సూచించారు. స్టెరాయిడ్ మాత్రలు, క్రీములు వాడితే ఫంగల్ ఇన్ఫెక్షన్ తగ్గకపోగా మరింత అధికమై శరీరం అంతా వ్యాపిస్తుందని సూచించారు. స్టెరాయిడ్ ఔషధాలతో ఫంగల్ ఇన్ఫెక్షన్ తాత్కాలికంగా తగ్గినట్లు అనిపించి, మరింత వ్యాపిస్తుందని స్పష్టం చేశారు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గుతుందని తెలిపారు. వ్యాధి ఇంకా ముదురుతుందని స్పష్టంగా వివరించారు. వ్యాధి ముదిరితే వ్యాధిని నయం చేయడానికి సమయం అధికమవుతుందని సూచించారు. కావున చర్మవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చర్మవ్యాధి వైద్య నిపుణులను సంప్రదించి, నాణ్యమైన వైద్య సేవలు పొందడం ఉత్తమమైన మార్గమని హితబోధ చేశారు.

# కామ్రేడ్ యాదగిరి ఆశయాలను కొనసాగిద్దాం

## సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము



**నారాయణపేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** సిపిఐ(ఎంఎల్)మాస్ లేని రాష్ట్ర నాయకులు, నిజాంబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యాదగిరి ఆశయాలను కొనసాగిద్దాం అని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. కామ్రేడ్ కర్నాటి కృష్ణ యాదగిరి చివరి శ్వాస విడిచారు. ఆయనను స్మరించుకుంటూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ లోని, భగత్ సింగ్ భవన్, సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ యాదగిరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ యాదగిరి పాత నల్లగొండ జిల్లా సంస్థ నారాయణపూర్ మండల కేంద్రం. ఉద్యోగం రీత్యా ,ఆ తరువాత విప్లవోద్యమంకై నిజామాబాద్ లో స్థిరపడ్డారు. 1969లో సాంఘిక సంక్షేమ శాఖ లో ఎల్డిసీగా ఉద్యోగం చేస్తూ,కామ్రేడ్ డీవీ కృష్ణ, దాసు స్ఫూర్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ బాధ్యతలను స్వీకరంచారు. ఆనాటి నుంచి వెనుతిరిగి చూడలేదు. ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితాన్ని ఎదుర్కొన్నారు .ఆయన జీవిత మంతా పార్టీకే ధారపోసారు. జీవిత కాలంలో పీడీత ప్రజల పక్షాన పోరాడిన చరిత్ర అయినది. ఎన్నో నిర్బంధాలు, రాజ్యహింసను, వామపక్ష టెర్రరిజాన్ని ఎదురుకొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన అనేక భూపోరాటాలకు, ఇండ్ల స్థలాలకై జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిరక్షణ కోసం పోరాడారు. బీడీ కార్మికుల పోరాటాలకు, ఖలీల్ వాడి స్కూల్ గ్రౌండ్ రక్షణకై, చెరకు రైతుల, ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిస్కారంకై మార్గదర్శకం చేశారు. పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను అమలు కోసం దీక్షతో కృషి చేశారు. తన సుదీర్ఘ పోరాటం ఎంతోమంది నాయకులకు కార్యకర్తలకు ఆదర్శమని ఆయన ఆశయ సాధన కోసం పోరాడదాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ నాయకులు చెన్నారెడ్డి నారాయణ, ఏ.నరసింహ, బి.నరసింహ, వెంకట్ రాములు, పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.భాస్కర్, జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు మంజుల, పి డి ఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి మహేష్, మాజీ జిల్లా సహకార దర్శి బాలరాజ్, జిల్లా నాయకులు సాగర్, మహిపాల్ ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



**ముస్తాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా మాశెట్టి లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శిగా కూర సంతోష్, ఉపాధ్యక్షులుగా గందె చంద్రం బండారి సత్తయ్య ఉప్పల చంద్రం, కోశాధికారిగా కొండాపూర్ శ్రీనివాస్ మురికి వెంకటేశం, కార్యదర్శులుగా కూర నగేష్ ముస్తాబాద్ గరిపెల్లి రమేష్ నామాపూర్, పప్పుల శ్రీకాంత్ ముస్తాబాద్, కోటగిరి సతీష్ చికోడు, భాస్కర్ పోతుగల్, భద్రయ్య మొరాయిపల్లె, గౌరవ సభ్యులుగా కూర బిక్షపతి, చంద విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ప్రభుత్వం సూచించిన ధరలు మాత్రమే వసూలు చేయాలి

## మీసేవ కేంద్రాల నిర్వాహకులకు అంబర్ పేట ఎమ్మార్వో ఆదేశం



**అంబర్ పేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** అంబర్ పేట మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలో ఉన్న మీసేవ కేంద్రాల ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునే వారి నుండి నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన ధరను మాత్రమే వసూలు చేయాలని తహసిల్దార్ వీరాభాయి ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలోని కొంతమంది మీసేవ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తుదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. మీసేవ కేంద్రాల నిర్వహకులు దరఖాస్తుదారుల వద్ద ప్రభుత్వం సూచించిన రేట్లను మాత్రమే వసూలు చేయాలని సూచించారు. దరఖాస్తు దారుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తే మీసేవ కేంద్రాల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలు ఖాతరు చేయని మీసేవ కేంద్రాల లైసెన్సులను రద్దు చేస్తామని ఆయన తెలిపారు.

# మైనార్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



**భువనగిరి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మహమ్మద్ లాయక్ అలీ ఆధ్వర్యంలో నూతన 2025 సంవత్సరం క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉద్యోగస్తులు మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ లాయక్ అలీ ప్రధాన కార్యదర్శి అజయ్ హుస్సేన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జమాల్ షరీఫ్ ఫరాతుల్లా బియబాని ముజఫర్ అలీ బాబా మిస్బావుద్దిన్ మహమ్మద్ అప్రోచ్, ఖయ్యూం జాఫర్, ఉద్దీన్, సలీం, సలీం పాషా, అక్బర్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ కమాన్ కు కార్పొరేటర్ భూమి పూజ



**ఉప్పల్. జనవరి 2 (నిఘా న్యూస్):** ఉప్పల్ డివిజన్ లోని న్యూ శాంతి నగర్ కాలనీ కమాన్(ముఖ ద్వారం) భూమి పూజ ఆదివారం జరిగింది. భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కార్పొరేటర్ రజిత రెడ్డి విచ్చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీలవాసుల సమక్షంలో కమాన్ శంకుస్థాపన (భూమి పూజ) వైభవంగా జరిగింది. న్యూ శాంతి నగర్ లోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయ ముఖ ద్వారం నిర్మాణానికి 10 లక్షల రూపాయలు విరాళం అందించిన బియ్య లింగయ్య కుటుంబ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యూ శాంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పబ్బతి వెంకటేష్ , గౌరవ అధ్యక్షులు మన్నే సిద్ది రాములు, జనరల్ సెక్రెటరీ బాదే ఆంజనేయులు, ఉపాధ్యక్షులు నడిపూడి భాస్కర్, కొండం రావేందర్ రెడ్డి, తన్నేరు కొండల్ రావు, ముఖ్య సలహాదారులు కావలి శ్రీనివాస్, లింగంపల్లి రామకృష్ణ తుమ్మల దేవి రెడ్డి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ బచ్చ నర్సింహా, ఆర్గనైజర్ సెక్రెటరీ సంబరం శివ కుమార్, గువ్వల భరత్ కుమార్, అంబటి సందీప్, గాలేగోని అజయ్, కోశాధికారి చిన్నరాజు ప్రేమ్ కుమార్, పబ్బతి పుష్ప లత చంద్ర కళ మంజుల వెంకట్ లక్ష్మి, మల్లమ్మ, రజితమ్మ, సోము బాలమణి, ఈగ ఆంజనేయులు, ఈగ రాజేష్, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కసిరెడ్డిని కలిసిన ఎస్ ఎస్ సి పూర్వ విద్యార్థులు



**బీబీనగర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాసిరెడ్డి నారాయణరెడ్డి ని కలిసిన 89-90 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు. బీబీనగర్ మండల పరిధిలోని వెనికిరాల గ్రామంలో 10వ తరగతి చదువుకునే అవకాశం ఉండేది కాదు. కసిరెడ్డి నారాయణరెడ్డి అదే గ్రామ వాస్తవ్యులు కావడంతో ఆ విద్య కష్టాలను తాను కూడా ఎదుర్కొనడంతో భవిష్యత్తులో రాబోయే తరాలు విద్యకు లోటు ఉండకూడదనే ఆలోచనతో ఆయనకు నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా మంచి పట్టు ఉండడంతో వెంకిర్యాల గ్రామంలో మండల పరిషత్ పాఠశాల నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు కావాలని సంబంధిత అధికారులతో చర్చించి అనుమతి తీసుకొచ్చాడు. దీంతో గదుల నిర్మాణం కూడా గ్రామ పెద్దల సహకారంతో పూర్తి చేయించాడు. అదే విశ్వాసంతో, మర్యాదపూర్వకంగా ఆదివారం 1989-1990 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు కొందరు నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనకు పూల గుచ్చాలను అందజేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాశబోయిన బాలకృష్ణ, బూరుగుపల్లి గణేష్, ఉప్పల సుధాకర్, కొమిరి రమేష్ యాదవ్, మార్త రమేష్, జంగ లక్ష్మయ్య యాదవ్, పెద్ద రాముల మల్లేష్, అశోక్ ముదిరాజ్, చిలుగురాజు కిషన్ రజాక, అరిగే దుబాయ్ రమేష్, ఆరే నరసింహ నరసింహ, సోమ వెంకటేష్, అరిగే లక్ష్మి, యాకరి లింగం, తదితరులు పాల్గొన్నారు.

# బాపులపాడులో.. సీతారామ లక్ష్మణ హనుమ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ

## హాజరైన గన్నవరం ఎమ్మెల్యే దంపతులు



**బాపులపాడు, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామము నందు ధర్మకోనేరు వద్ద నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వర, నాగేంద్రస్వామి, జీవధ్వజ శిఖర, శ్రీ సీతారామ లక్ష్మణ హనుమ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ పవిత్ర మహోత్సవంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సతీమణి యార్లగడ్డ జ్ఞానేశ్వరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ దంపతులను ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం బాపులపాడు మండలం, హనుమాన్ జంక్షన్ లో ఉన్న శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ అధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక జీవితం గడపాలని సూచించారు.

# అరేయ్ ఒరేయ్ అంటూ.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**గన్నవరం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** వాళ్లందరూ నాలుగు దశాబ్దాల క్రితం పదవ తరగతి చదువుకున్నారు. పిల్లలు మనములు, మనుమలాండ్రలతో ఆడుకుంటూ వివిధ ఉద్యోగాలు చేస్తూ దేశ విదేశాలలో స్థిరపడ్డారు. అందరిని కలపాలని ఆలోచన ఆ బ్యాచ్ కు చెందిన కస్తూరి అప్పారావుకు తట్టింది. అదే తరువాయి వెంటనే వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. అందులో వారితో పాటు చదివిన వారిని మందిని యాడ్ చేశారు. కొంతమంది విదేశాల్లో, మరికొందరు సుధీర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అందరూ ఫిబ్రవరి 2 న వారు చదివిన గన్నవరం బాలుర హైస్కూల్లో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం జరిగిన 1984-85 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వారందరూ అరే ఒరే అంటూ పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. ఎవరెవరు ఎక్కడ ఉంటున్నారు అడిగి తెలుసుకున్నారు. విద్య బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులైన టి ఎస్ ఆర్ కె ప్రసాద్, కె.జయరాజు, పి.రామానుజచార్యులు, డి.సాంబ శివరావులను పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జోక్స్ వేసుకుంటూ పాటలు పాడుతూ డాన్సులు చేశారు. మళ్లీ విద్యార్థి దశలోకి వచ్చామంటూ కేరింతలు కొట్టారు. వీళ్ళను చూసి ఉపాధ్యాయులు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో కార్యదర్శి దామెర సీతారామయ్య, కోశాధికారి కోనేరు రవికుమార్, ఆత్మీయ కలయిక జీవితకాల స్పాన్సర్ కొల్లిపర శివప్రసాద్, సజ్జ శ్రీనివాసరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో తెలంగాణాకు అన్యాయం

- మూసి ప్రక్షాళన, రెండోదశ మెట్రోకు మొండి చెయ్యి
- కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్



**షాద్ నగర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** తెలంగాణ సమస్యలు, అభివృద్ధి అంశాలను పట్టించుకోకుండా, స్థూల దేశీయోత్పత్తికి ఐదు శాతం వాటాను అందిస్తున్న తెలంగాణను బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, లక్షల కోట్ల ప్రజల సంపదను ప్రైవేట్ కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతూ దాన్ని మభ్యపెట్టే ప్రయత్నం తప్ప వేరే ఎంలేదని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఆరోపించారు. నిరుద్యోగిత తగ్గించడం, ఉద్యోగాల కల్పన ఊసే లేదన్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా అంటూ స్కీమ్‌లన్నీ కేవలం ప్రకటనలే పరిమితం కానున్నాయని ఎద్దేవా చేశారు. తలసరి ఆదాయం తగ్గుతుంటే, కొనుగోలు శక్తి తగ్గుతుందని, కొంత మందిని తెరపైకి తీసుకొచ్చి పన్ను మినహాయింపు ఇస్తున్నాం అనడం సరికాదన్నారు. తెలంగాణ నుంచి సుమారు రూ.26 వేల కోట్ల పన్ను ఆదాయం కేంద్రానికి పోయిందని, తెలంగాణ నుండి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా తెలంగాణకు ప్రధాని మోదీ ద్రోహం చేశారు. ఈ బడ్జెట్‌లో కేంద్ర సెస్‌లను మరింత పెంచుకుందని, దానివల్ల రాష్ట్రాల పన్నుల వాటాలు తగ్గే ప్రమాదం ఉంది. కేంద్ర పథకాలపై రాష్ట్రాలు ఆధారపడేలా నిధులు పెంచింది అన్నారు. సంక్షేమ రాజ్యంగా ఉన్న దేశాన్ని పన్నుల రాజ్యంగా మార్చిందని అన్నారు. ఆదాయపు పన్ను కట్టే రెండు, మూడు కోట్ల మందికి సంబంధించిన అంశాన్ని తెర మీదకి తెచ్చి, పన్ను మినహాయింపుతో గొప్ప మార్పులు చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఒకవైపు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకెళుతున్నామని చెబుతూనే, కనీసం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేని దుస్థితిని తీసుకొచ్చిందని మండిపడ్డారు. వ్యవసాయాన్ని పెద్ద పీట వేస్తున్నామని అంటున్నారు. కానీ హోంశాఖకు కేటాయించిన బడ్జెట్ కూడా కేటాయించక పోవడం చూస్తుంటే, ఏపాటి పెద్ద పీట వేస్తున్నారో అర్థం అవుతుందన్నారు.



కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ కు నిధుల కేటాయింపు పై వివక్ష చూపి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసినందుకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్ బ్యాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ తదితరులు.

*-అంబర్ పేట్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):*

# అత్యాశలకు పోవద్దు

## సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోవద్దు

## జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** సైబర్ నేరగాళ్ల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతము అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడం జరుగుతుందని వివరించారు. అధిక లాభాల కోసం ఆశపడి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టకండి ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో యాడ్స్ చూసి మోసపోకండి. మీరు పెట్టుబడి పెట్టండి, మీ బంధుమిత్రులతో పెట్టుబడి పెట్టించి అదిక లాభాలు పొందండి అంటూ ఆశ చూపించే చైన్ ఇన్వెస్ట్మెంట్ మోసపూరితమైనదని గ్రహించండి. ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మకండి అది సైబర్ మోసం అని గ్రహించండి. ఆన్లైన్ లోన్స్ గురించి లోన్స్ యాప్లను మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసినప్పుడు మీ ఫోన్లో ఉన్న అన్ని ఫోన్ నెంబర్ల ఫోటోలు, మీ వ్యక్తిగత వివరాలు యాప్ వారు మీ అనుమతి లేకుండా తీసుకుంటారు తర్వాత మీరు తీసుకున్న లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో వేధింపులకు గురి చేస్తారు తస్మాత్ జాగ్రత్త అని ఆన్లైన్ లోన్ ఆప్స్ ద్వారా లోన్స్ తీసుకోరాదని సూచించారు. లోన్ ఆప్స్ వేధింపులకు మీలో మీరే బాధపడవద్దు, క్షణికావేశాలకు పోవద్దు. మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పండి, 1930 కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# వర్గీకరణ విషయంలో.. పార్టీకి నష్టం జరగకుండా చూడండి

- కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి
- పిసిసి అధ్యక్షులకు వినతి అందజేసిన భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్



**భువనగిరి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ ఆధ్వర్యంలో భువనగిరిలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బర్రె జహంగీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం, సుప్రీంకోర్టు వర్గీకరణకు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించిన రోజు తెలంగాణ శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఇప్పటికే వర్గీకరణ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని, పార్టీకి నష్టం జరగకుండా మాదిగల న్యాయమైన కోరికను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఈరపాక నరసింహ, పడిగల ప్రదీప్, కొల్లూరి రాజు, గ్యాస్ చిన్న, దర్గాయి దేవేందర్,డాకూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సానుకూలం

### జర్నలిస్టుల సాధకబాధకాలు తెలుసు

### ఖమ్మం రోల్ మోడల్‌గా ఉండేలా చూస్తా

### ఎన్నికల కోడ్ ముగిశాక ప్రక్రియ ముందుకు

### త్వరలో జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు



**ఖమ్మం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరంగా చిక్కులు లేకుండా నిపుణుల సలహాతో ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ రోల్ మోడల్ గా ఉండేలా చేస్తామన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం తనను కలిసి వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులతో మంత్రి చర్చించారు.జుజూబి మాటలు చెప్పనని,ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని,కోడ్ పూర్తయ్యాక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి తప్పకుండా నిర్ణయం తీసుకుందామన్నారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు ఉన్నారు.వాళ్ల సాధక బాధకాలు నాకు తెలుసు కాబట్టి, ముందుగానే డబ్బులు కట్టించి కాలయాపన చేస్తూ మభ్యపెట్టే తీరు నాది కాదని స్పష్టం చేశారు.ఆకలితో అలమటించి, రూపాయి రూపాయి పోగేసుకునే ఏ ఒక్క జర్నలిస్టు డబ్బులు వృధా కావద్దని ఆ దిశగానే నా ప్రయత్నం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఎలా వీలైతే అలా నిపుణుల సూచన మేరకు ముందుకెళ్దామన్నారు. ఏదో ఒక రకంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు.కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటివాటిని పట్టించుకోను, కాని జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న చిత్తశుద్ధి తో వున్నానని స్పష్టం చేసారు కొంతమంది జర్నలిస్టు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేద్దాం అన్నారు.

## గొంగడి త్రిషను అభినందించిన హరీష్ రావు




**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఐసీసీ అండర్ -19 టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన టీమిండియా జట్టుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం భారతదేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ గెలుపు మహిళా క్రీడాకారిణుల ప్రతిభ, కృషి, దృఢ సంకల్పాన్ని లోకానికి ఛాటి చెబుతుంది అన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ, భద్రాచలం యువతి గొంగడి త్రిష ఈ టోర్నీలో 300 కంటే ఎక్కువ పరుగులు చేయడమే కాకుండా 10 వికెట్లు తీసి అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, రాష్ట్రానికి గొప్ప పేరు తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా త్రిషకు హరీష్ రావు ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. గొంగడి త్రిష తెలంగాణ భవిష్యత్ తరాల క్రీడాకారిణులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అయితే మహిళల అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్?లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమిండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో 1 వికెట్? కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష 33 బంతుల్లో 44 పరుగులు (8ఐ4) చేసి నాటౌట్‌గా నిలిచింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభణతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23)?. నలుగురు ప్లేయర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. భారత జట్టు బౌలర్లలో త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ తీశారు. కాగా భారత మహిళల జట్టుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## అంబేద్కర్ కు ఘనంగా 157వ జ్ఞాన మాల కార్యక్రమం



**కీసర, జనవరి 2 (నిఘా న్యూస్):** కీసరలో వారం వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 157వ వారం జ్ఞానమల కార్యక్రమం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 157 వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కీసర మండల ఇన్చార్జి బుడిగే జగన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కీసర మండల ఇన్చార్జి బుడిగే జగన్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 157వ జ్ఞానమాన కార్యక్రమానికి రావడం సంతోషం వ్యక్తం చేస్తూ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలని ప్రతి యువత ముందు వచ్చే రోజు ఉందని అంబెద్కర్ ప్రపంచంలోనే గొప్ప శక్తిమంతుడు అని అన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కానుకుంట శ్యామ్ కుమార్, కార్యదర్శులు కంచేమీది సంతోష్,బత్తుల ఆంజనేయులు, జిల్లా బీజేపీ స్వచ్ఛభారత్ అధ్యక్షుడు చినింగని సుధాకర్,కీసర బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు చినింగని బాల్ రాజ్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కీసర మండల అధ్యక్షులు బక్కని కుమార్, ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, గోధుమకుంట గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మంచాల శ్రీకాంత్, చీర్యాల మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్,రామరం రమేష్ , కీసర గుట్ట ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ రాగుల రమేష్, ఎర్ర సాయిలు, బానాల నాగేష్,తుడుం బాలరాజు, మేకల మహేష్ లు తదితరులు పాల్గొన్నారు.

## నారపల్లిలో సుధాలక్ష్మికి ఘన సన్మానం



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** సుర్వి సుధాలక్ష్మికి నారపల్లి గ్రామస్తులు, మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి 17వ వార్డు మాజీ కౌన్సిలర్ సుర్వి సుధాలక్ష్మి ఐదు సంవత్సరాలు పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని, వారికి కృతజ్ఞతగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాలక్ష్మి మాట్లాడుతూ నా వార్డులో ప్రజలు ఏ నమ్మకంతోనైతే ఓట్లువేయించడానికిగెలిపించారు. అదే నమ్మకంతోనే వారికి ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి చేశానని వారు తెలిపారు. అదేవిధంగా వార్డులో మున్సిపల్ సిబ్బంది కూడా చక్కగా చెప్పిన పని పూర్తి చేస్తూ ప్రజల మన్నలను పొందిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భర్త సుర్వి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది గాంధారి అశోక్, శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సివిల్ డ్రెస్ లోనే పోలీసు విధులు

- వీళ్లకు బదిలీలు ఉండవా..?
- ఏళ్ల తరబడి నగర టాస్క్ ఫోర్స్ విభాగంలో పోలీసు సిబ్బంది తిష్ట
- గుప్పుమంటున్న అవినీతి ఆరోపణలు



**హైదరాబాద్. ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** హైదరాబాద్ నగర పోలీస్ శాఖలోని ఓ విభాగంలో వాళ్లు పోలీస్ విధులు నిర్వహిస్తారు. కానీ వాళ్లు ఎప్పుడూ ఖాకీ డ్రెస్ లో కనిపించరు. పోలీస్ శాఖలోని ఇతర విభాగాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఖాకీ డ్రెస్ లో విధులు నిర్వహిస్తూ ఉండడం మనం చూస్తుంటాం కానీ హైదరాబాద్ నగర టాస్క్ ఫోర్స్ విభాగంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది ఖాకీ డ్రెస్ లో ఎప్పుడూ కనిపించరు. వీళ్లు ఎప్పుడూ సివిల్ డ్రెస్ (సఫారీ సూట్) లో దర్శనమిస్తుండడం పరిపాటి. టాస్క్ ఫోర్స్ విభాగంలోని ఒక జోన్ నుంచి మరో జోన్ కు పైరవీలు చేసుకుని ఏళ్ల తరబడి తిష్ట వేసిన కొంతమంది టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లు, హెూంగార్డులకు అసలు బదిలీలే ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్ నగర టాస్క్ ఫోర్స్ విభాగానికి మంచి గుర్తింపు ఉంది. ఎన్నో సంచలనాత్మకమైన కేసులను చేధించిన ఘనత టాస్క్ ఫోర్స్ కు ఉంది. అయితే ఈ విభాగంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది అవినీతి కారణంగా టాస్క్ ఫోర్స్ విభాగానికి ప్రజల్లో చెడ్డపేరు వస్తుందనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కమిషరేట్ పరిధిలో ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్ ఐదు టాస్క్ ఫోర్స్ జోన్లు పనిచేస్తున్నాయి. ఒక్కో జోన్ ను డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తుంటారు. ఒక్కో జోన్ ఒక ఇన్స్పెక్టర్, ముగ్గురు నుంచి నలుగురు సబ్ ఇన్స్పెక్టర్లు, నాలుగురైదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, జోన్ పరిధిలో ఎన్ని పోలీసు స్టేషన్లు ఉంటే అంతమంది కానిస్టేబుళ్లు పనిచేస్తుంటారు. వీళ్లతో పాటు ఐదు, ఆరుగురు హెూంగార్డులు డ్రైవింగ్, హల్ డీ విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఆయా జోన్లలో ఏళ్ల తరబడి తిష్టవేసిన కొంతమంది కానిస్టేబుళ్లు, హెూంగార్డులు చేతివాటాన్ని పాల్పడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోలీసుశాఖలోని ఏ విభాగంలోనైనా విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది మూడేళ్ల తరువాత ఇతర విభాగానికి బదిలీపై వెళ్లాల్సి ఉంటుంది. కానీ టాస్క్ ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది పైరవీలు చేసుకుని ఒక్క జోన్ నుంచి మరో జోన్ కు మారుతూ 10- 15 ఏళ్లకు పైగా ఇక్కడే తిష్టవేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వీరిని బదిలీ చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ పెద్దలతో చెప్పించుకుని మరి తిరిగి డిప్యూటేషన్ పై అదే స్థానంలో పోస్టింగ్ వేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖుల పర్యటనలు, శాంతిభద్రత నిర్వహణలో భుజ, బుద్ధిబలం ఉపయోగించే టాస్క్ ఫోర్స్ విభాగంలోని కొంతమంది పోలీసు సిబ్బంది మాముళ్ల మత్తులో జోగుతున్నట్లు విమర్శలున్నాయి. సదరు సిబ్బంది జోన్ల పరిధిలోని భూవివాదాలు, సివిల్ పంచాయితీల్లో తలదూర్చి పెద్ద ఎత్తున కాసులు కూడబెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. భూవివాదాలు, సివిల్ తగాదాల్లో టాస్క్ ఫోర్స్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు జోక్యం చేసుకుంటూ కేసుల పేరుతో బెదిరిస్తూ ఇరువర్గాల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. నగరంలోని రహస్యంగా కొనసాగుతున్న జూదగృహాలు, మసాజ్, హుక్క సెంటర్లు, గుట్కా, సట్టాకేంద్రాలు, గంజాయి అడ్డాల నిర్వాహకులనుంచి టాస్క్ ఫోర్స్ సిబ్బందికి ప్రతినెలా మాముళ్లు అందుతుండటంతో వాటివైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే పిడిఎస్ రైస్, గ్యాస్ రీఫిలింగ్ సెంటర్ల నిర్వహకులు కూడా వీరికి మామూళ్లు సమర్పించుకున్నట్లు తెలిసింది. ప్రధానంగా ఈస్ట్, సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ విభాగాల్లో ఏళ్ల నుంచి తిష్ట వేసిన కొంతమంది కానిస్టేబుళ్లు, హెూంగార్డుల పై అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలోనే ఈస్ట్ జోన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్లకు ఇన్ చార్జ్ గా వ్యవహరిస్తున్న టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్ల అవినీతిపై నగర పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీస్ కమిషనర్ నగర టాస్క్ ఫోర్స్ విభాగం పై దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాజీ ఎఎస్ఐ జన్మదిన వేడుకలు



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఘట్ కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ ఎఫ్ సి నగర్ లో మాజీ ఏఎస్ఐ బూరుగుపల్లి గణేష్ జన్మదిన వేడుకలను బంధుమిత్రులు ఘనంగా నిర్వహించారు. రక్షకభటునిగా ఎంతో మందికి రక్షణ కల్పిస్తూ ఇది నిర్వహణలో తనదైన శైలిలో ప్రజలకు ఎనలేని సేవలందించినందుకు కృతజ్ఞతగా ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కేక్ కట్ చేయించి ఘనంగా శాలులతో సన్మానించారు.

## విజయవంతమైన ఐఎంఏ ఉచిత వైద్య శిబిరం

### సేవలను సద్వినియోగం చేసుకున్న నక్కలపల్లి వాసులు



**వరంగల్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లి గ్రామంలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలతోపాటు నక్కలపల్లి చుట్టుపక్కల ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు సద్వినియోగం చేసుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ నాగార్జున రెడ్డి సూచనలతో కార్యదర్శి డాక్టర్ అజిత్ మహమ్మద్ పర్యవేక్షణలో వివిధ విభాగాల ప్రత్యేక వైద్యులు చిన్నపిల్లల నుండి పెద్దల వరకు శిబిరానికి వచ్చిన వారికి పరీక్షించినారు. ఉచితంగా బిపి, చక్కెర వ్యాధి, రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఈసీజీ తీశారు. అనంతరం ఉచితంగా ఔషధాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మామనూరు సిఐ రమేష్ హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించిన వైద్యుల బృందాన్ని, ఆస్పత్రి సిబ్బందిని గ్రామ ప్రజలను వైద్య శిబిరం పెట్టినందుకు అభినందించారు. శిబిరం ముగిసిన అనంతరం ఐఎంఏ కార్యదర్శి అజిత్ మహమ్మద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో 150కి పైగా ప్రజలు వైద్య సేవలు అందుకున్నారని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఈ ఎన్ టీ వైద్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, కంటి వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రేవంత్, డాక్టర్ జటాదర్, ఎముకల వైద్యులు డాక్టర్ శంకేసి శిరీష్ కుమార్, స్త్రీ వైద్య నిపుణులు మంతెన శిరీష, మానస శ్యామల, ఉచిత వైద్య శిబిరం ఆర్గనైజర్ వాల్డి రాజేందర్ ఉసిల్ల కుమార్ మాల మహానాడు అఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి గ్రామ పెద్దలు ఉసిల్ల మల్లయ్య మన్నే బాబురావు సాదు రాజశేఖర్ బన్న కృష్ణ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలందరి సహకారంతో వార్డుల అభివృద్ధి

తాజా మాజీ కౌన్సిలర్ లు సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్



**అబ్దుల్లాపూర్ మెట్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి అదనంగా వార్డుకు రెండు కోట్లు కేటాయించి వార్డుల అభివృద్ధికి తోడ్పడునందించారని తాజా మాజీ కౌన్సిలర్ లు సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు శిల్పి ఎన్ క్లేవ్ లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ కౌన్సిలర్లు సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధి వార్డులలోని ఆయా కాలనీల సంక్షేమ సంఘాలు, కాలనీవాసుల సహకారంతో మున్సిపాలిటీలోని తమ వార్డులను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్లామని అన్నారు. 23వ వార్డులో శిల్పికాలనీతో పాటు లక్ష్మారెడ్డి పాలెంలోని పలు కాలనీలకు కోట్ల రూపాయలు నిధులు కేటాయించుకున్నామని అదేవిధంగా ఆరో వార్డులో సైతం గత ప్రభుత్వాలు విస్మరించిన అభివృద్ధి పనులన్నింటినీ తమ హయాంలో పూర్తి చేశామని స్పష్టం చేశారు. తమ పదవి కాలం ముగుస్తున్న క్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు వార్డుకో రెండు కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడంతో తాము చేస్తున్న అభివృద్ధి పనులకు మరింత తోడ్పాటు తోడ్పాటునందించిన అన్నారు. అభివృద్ధి ధ్యేయంగా మల్ రెడ్డి రంగారెడ్డి ముందుకు వెళ్తున్నారని అన్నారు. శిల్పి కాలనీ అభివృద్ధికి సహకరించిన కౌన్సిలర్లకు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొమ్మిడిక అల్వాల్ రెడ్డి ,లక్ష్మారెడ్డి పాలెం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోవింద్ రెడ్డి, పోరెడ్డి మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సురేష్ రెడ్డి దుబ్బాక, గౌరవ అధ్యక్షులు చౌదరి రెడ్డి, ఉపాధ్యక్షులు మేక మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి బండ, చీఫ్ అడ్వైజర్ వీరారెడ్డి పశ్య, సెక్రటరీ శేఖర్ రెడ్డి పాల్వాయి, జాయింట్ సెక్రెటరీలు వెంకట్ రెడ్డి, నర్సింహారెడ్డి దేవరపల్లి, ట్రెజరర్ లు , కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు





- ఊరంతా బోనాలు చేసి బొడ్రాయి గ్రామ దేవతకు మొక్కులు చెల్లింపు
- హాజరైన జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్



**వరంగల్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ పరిధిలోని రంగశాయిపేటలో ఆదివారం బొడ్రాయి బోనాలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ కూడలి బొడ్రాయి వద్ద, రామాలయం బొడ్రాయి లకు మొదటి వార్షికోత్సవంలో భాగంగా సాంప్రదాయం ప్రకారం శాలివాహనులు తమ తొలి బోనాన్ని గ్రామ దేవతలకు సమర్పించారు. డోలు వాయిద్యాల నడుమ భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలను ఎత్తుకొని బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించి తమ ప్రాంతాన్ని చల్లంగా చూడాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. కళాకారుల డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తులు పూణకాలతో ప్రాంగణమంతా మార్మోగింది. భక్తులు తన్మయంతో పులకించిపోయారు. ఊరంతా ఒకేసారి బోనాల పండుగను చేసుకోవడంతో ప్రాంతమంతా జన జాతరను తలపించింది. మహిళలు ఉదయం నుండి రాత్రి వరకు బోనాలను సమర్పించారు. బొడ్రాయి ప్రతిష్టాపనకు సహకరించిన దాతలను ఈ సందర్భంగా ఆర్ వై ఎఫ్ సభ్యులు శాలువా, మెమోంటో తో సత్కరించారు. ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని గ్రామ దేవతలను దర్శించుకున్నారు. రంగశాయిపేట ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్, సుల్తానాబాద్ ఎస్సై చిట్ల శ్రవణ్ కుమార్, కార్పొరేటర్లు గుండు చందన, ఉత్సవ కమిటీ కన్వీనర్లు కేడల జనార్ధన్, కొల్లూరి యోగానంద్, గుండు పూర్ణచందర్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, డాక్టర్ శంకేసి శిరీష్ కుమార్ చందా మనోహర్, మండల నరసింహా రాములు శేర్ల అనిల్ కుమార్, గాదె వేణుగోపాల్, శంకేశి రాజేష్, వలపదాసు సురేష్ స్థానిక గాయకుడు మునుకుంట్ల శ్యామ్, మండల నరసింహా రాములు బిజెపి నాయకులు కే రవీందర్, తాళ్లపల్లి అర్జున్ , బక్కి రంజిత్, ఆరె కార్తీక్, శ్రీరామోజు మోహన చారి, పరమేష్, కుసుమ కేదారి, మండల రమేష్, మనోహర్ గ్రామ పెద్దలు, ఆర్ వై ఎఫ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలు గాలికి..

### ప్రాధాన్యత గల ప్రాజెక్టులకూ రిక్తహస్తం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించింది. రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క పథకానికి గానీ, ప్రాజెక్టుకు గానీ బడ్జెట్‌లో చోటుదక్కలేదు. రాష్ట్రప్రభుత్వంపలుప్రాజెక్టులకోసం ప్రతిపాదనలిచ్చినా, ఫలితం కనిపించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఇచ్చినవినతులపైనాస్పందించలేదు. కొత్తప్రాజెక్టులు, కార్యక్రమాలోనూ రాష్ట్రానికి చోటు దక్కలేదు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో మరోసారి 'తెలంగాణ' పదం వినిపించకుండా పోయిందని రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం భారాస తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. అన్నీ పెండింగే విభజన హామీలకు సంబంధించిన ప్రతిపాదనలు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్నాయి. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు వంటివి.. ఈ జాబితాలోఉన్నాయి. ప్రధానంగామహబూబాబాద్‌జిల్లా బయ్యారంలో భారీ ఉక్కు కర్మాగారం నిర్మించాలని రాష్ట్రం కోరుతోంది. దీనిపై వివిధ ప్రతిపాదనలున్నా.. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. కాజీపేటలో రైల్వే కోచ్‌ల తయారీ కర్మాగారంపైనా అధికారిక ప్రకటన వెలువడలేదు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా.. పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఏళ్ల తరబడి డిమాండ్ల మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేసినా, బడ్జెట్లో దానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా, నవోదయ కళాశాలలు, సైనిక పాఠశాలలతో పాటు కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుపైనా కేంద్రం నుంచి స్పందన లేదు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. వీటికి భారీగా నిధులు అవసరమవుతాయని, కేంద్రం సాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హెూంశాఖ మంత్రి అమిత్‌షా, ఇతర కేంద్రమంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. సీఎం, ఆయా శాఖల మంత్రులు కేంద్రానికి లేఖలు రాసి గుర్తుకు తెస్తున్నారు. ఆయా శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లు సైతం దిల్లీకి వెళ్లి కేంద్ర కార్యదర్శులను కలుస్తున్నారు.. అయినా కేంద్రం నుంచి స్పందన లేదు. నిధులు తక్షణావసరమైనా.. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతిసారీ పెండింగు, కొత్త ప్రాజెక్టులు, ఇతర ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తు చేస్తోంది. రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మూసీ పునరుజ్జీవ పథకం సహా తొమ్మిది ప్రాజెక్టులకు రూ. 1.63 లక్షల కోట్లు కావాలని కేంద్రాన్ని కోరింది. ఇంకా సెమీకండక్టర్ మిషన్, సింగరేణికి కొత్త బొగ్గు గనులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా కేంద్రాన్ని కోరుతోంది. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు దిల్లీకి వెళ్లి కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ సహా పలువురు ఉన్నతాధికారులను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అటవీ శాఖ అనుమతులు, విద్యుత్ బస్సుల కొనుగోలుకు రాయితీలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 20 లక్షల ఇళ్లు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్, వ్యవసాయంలో సౌరవిద్యుత్ పంపుసెట్ల వినియోగానికి ప్రోత్సాహకాలు, ఫీడర్ స్థాయిలో సౌర విద్యుత్ వినియోగానికి అనుమతులు, విద్యుత్ అభివృద్ధి నిధి తదితరాలు కావాలని విన్నవించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వడ్డీ తగ్గించాలని, సంప్రదాయేతర విద్యుత్ కొనుగోలుపై జరిమానాను మినహాయించాలని, సంప్రదాయేతర విద్యుత్ నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు సమర్పించినా కేంద్రం కరుణించలేదు. తాజా బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సూక్ష్మ పరిశీలన చేశారు. ఏ శాఖ ద్వారా కూడా తెలంగాణ ప్రత్యక్ష ప్రయోజనాలు పొందే పథకాలు, కార్యక్రమాలు కనిపించలేదు. పరోక్ష ప్రయోజనాలను అన్వేషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు.

## రాష్ట్రంలో మొదలైన ఎండలు



**హైదరాబాద్ం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచే చలి తీవ్రత తగ్గి, ఎండలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఆదిలాబాద్ లో సాధారణం కన్నా 5.8 డిగ్రీలు అధికంగా 36.3డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. గత పదేళ్లలోనే ఇక్కడ అత్యధిక ఉష్ణోగ్రత 2021 ఫిబ్రవరి 25న (34.5) నమోదైంది. ఖమ్మంలోనూ సాధారణం కన్నా 3.3డిగ్రీలు అధికంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# భారత్ ఘన విజయం

ఇంగ్లండ్ తో జరిగిన ఐదో టీ 20లో భారత జట్టు 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్, ఓపెనర్ అభిషేక్ (135) సెంచరీతో చెలరేగడంతో 247 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో సాల్ట్(55) మినహా మిగతా ఇంగ్లాండ్ జట్టు సభ్యులు చేతులెత్తేయడంతో 97 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో షమీ 3, వరుణ్ చక్రవర్తి, దూబే, అభిషేక్ చెరో 2, బిష్ణోయ్ ఒక వికెట్ తీశారు. దీంతో 4-1 తేడాతో భారత్ సిరీస్ను కైవసం చేసుకుంది.

– హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్)



# కూతురు వివాహానికి కెసిఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే

**ఉప్పల్, జనవరి 2 (నిఘా న్యూస్):** ఎర్రవెల్లిలోని తన నివాసంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఆదివారం కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిసి ఈ నెల 15వ తేదీన జరుగు తన కూతురు వివాహానికి రావాల్సిందిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు ఆహ్వానించారు.



# బిజెపోళ్లు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై మోడీ సర్కార్ వివక్ష
- కేంద్రపద్దులో వాటా దక్కకున్నా అభివృద్ధి ఆగదు : కెఎల్ఆర్



**మహేశ్వరం, జనవరి 2(నిఘా న్యూస్):** చూపారని కేంద్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాష్ట్రాన్ని చిన్నచూపు చూసినా అభివృద్ధి, సంక్షేమం ఆగదని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న స్కిల్ యూనివర్శిటీ సహా పాలమూరు–రంగారెడ్డి, మెట్రో కారిడార్, ట్రిబుల్ ఆర్ నిర్మాణాల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా, పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర పద్దులో రాష్ట్రానికి కనీస వాటా దక్కక పోవటంపై బీజేపీ నాయకులు, కేంద్రమంత్రులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు. బీజేపీ చూపుతున్న వివక్షతను రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు అర్థం చేసుకోవాలని కేఎల్ఆర్ కోరారు. ఏ మోఖం పెట్టుకుని వచ్చే పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారని కిచ్చెన్న ప్రశ్నించారు. సవతి తల్లి ప్రేమను చూపకుండా అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని కాంగ్రెస్ నేత లక్ష్మారెడ్డి కోరారు. మహేశ్వరం నియోజక వర్గం మహానగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని కేఎల్ఆర్ అన్నారు.

# సంపన్నుల చేతుల్లో బిజెపి బందీ

- తెలంగాణపై మహా వివక్ష
- రాజకీయ వాంచతో అంకెల గారడీ
- సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**ఖమ్మం, ఫిబ్రవరి 2(నిఘా న్యూస్):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణపై మహా వివక్ష ప్రదర్శించారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. రాజకీయ వాంచతోనే బిజెపి దాని మిత్రపక్షాలు ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు పెద్దపీట వేశారని భారతదేశ చరిత్రలో ఇంతటి రాజకీయ వివక్ష ప్రదర్శించిన బడ్జెట్ మరొకటి లేదని ఆయన అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా వెళ్లి బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ, తెలంగాణకు కనీసం ఒక ప్రాజెక్టు కూడా కేటాయించకపోగా కనీస ప్రతిపాదన చేయలేదని ఆయన తెలిపారు. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే మేలు చేసే ఈ బడ్జెట్ను సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందని హేమంతరావు తెలిపారు. భారతదేశ రైతాంగం కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో చారిత్రాత్మక పోరాటం వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరను కల్పించాలని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతాంగ డిమాండ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే దానిని పట్టించుకోక పోగా కార్పొరేట్ శక్తులకు మేలు చేసేవిధంగా బడ్జెట్లో అంకెలను పొందుపర్చారని ఆయన తెలిపారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్తులో దేశాన్ని రుణ భారత్గా మార్చే ప్రమాదం ఉందని సుమారు 13.65 లక్షల కోట్ల రూపాయల లోటును ఎలా భర్తీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. విద్యా, వైద్య రంగాలను విస్మరించారని ధరల నియంత్రణపై ఊసెత్తలేదని బడ్జెట్లో అంకెలు చూస్తుంటే మోడీ సర్కార్ కార్పొరేట్లు, సంపన్నుల చేతుల్లో బంధీగా మారిందని అవగతమవుతుందని ఈ బడ్జెట్ను వ్యతిరేకించి భవిష్యత్తు పోరాటాలకు సిద్దం కావాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజ నేయులు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, ఎస్ కె సైదా తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం అందే వరకు పోరాటం ఆగదు

**ఆర్ ఆర్ పిఎస్ అధ్యక్షుడు, సైకిల్ యాత్ర సారథి చాపర్తి కుమార్ గాడ్గే**




**హనుమకొండ, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** జనాభాలో 65 శాతానికి పైగా ఉన్న బీసీ కులాలకు రాజ్యాధికారాన్ని సాధించేంతవరకు తాను చేస్తున్న పోరాటాన్ని విశ్రమించేది లేదని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సైకిల్ యాత్ర రథసారథి చాపర్తి కుమార్ గాడ్గే స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్లో జరిగిన బిసి యుద్ధభేరి మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రాజ్యాధికారం కోసం గతంలో 450 కిలోమీటర్ల పాదయాత్ర చేశానని అనంతరం కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 17 రోజులపాటు ఆమరణ దీక్ష చేశానని, గత 13 రోజులుగా రచ్చబండ కాడ రచ్చ చేద్దాం బీసీ రాజ్యాధికారాన్ని సాధిద్దాం అన్న నినాదంతో జనగామ జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మస్థానమైన జనగామ జిల్లా ఖిలాషాపూర్ నుండి బత్తిని మొగిలయ్య గౌడ్ అమరత్వం పొందిన ఖిలా వరంగల్ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టానని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికారాన్ని సాధించడానికి పోరాడుతానని ఆయన తెలిపారు.

# పరుపుల గోదాంలో అగ్నిప్రమాదం




**ఉప్పల్, జనవరి 2(నిఘా న్యూస్):** ఉప్పల్ బాగయత్ శిల్పారామం దగ్గర మూర్తి కంఫర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ స్టేషన్ అధికారి, ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మూర్తి కంఫర్ట్ పరిశ్రమలలో వివిధ రకాల పరుపులు తయారు చేస్తూ ఉంటారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో కార్మికులు పనిచేస్తుండగా వెనకవైపు మంటలు చెలరేగడంతో కార్మికులు కరెంటు బోర్డు స్విచ్ వేయ డానికి ప్రయత్నం చేశారు. కానీ కరెంటు వైర్ అప్పటికే కాలి పోవడంతో గోదాంలో మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో పరుపుల తయారీకి ఉపయోగించే యంత్రాలు, పరుపులు అగ్నిలో దహనమయ్యాయి. వాటి విలువ లక్షల్లో ఉంటుందని పరుపుల పరిశ్రమల యజమాని అన్నారు. ఉప్పల్ శిల్పారామం యూనిట్ నుంచి తెలంగాణ రాష్ట్ర ఫైర్ సర్వీసు సిబంది తెలంగాణ రాష్ట్ర పోలీస్ సిబ్బంది జిహెచ్ఎంసి డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్ తో వచ్చి మంటలు ఆర్పి వేశారు. కార్మికులు పనిచేస్తున్న సమయంలో వెనుక వైపు మంటలు చలరేగడంతో కార్మికుల మంటలు ఆర్పి ప్రయత్నంలో మోటారు స్విచ్ వేశారు. అప్పటికే షార్ట్ సర్క్యూట్‌తో కరెంటు వైర్ కాలిపోయింది. దానివల్ల అగ్ని ప్రమాదం చోటు చేసుకుందాన్ని ఆ సమయంలో పనిచేస్తున్న కార్మికులు అగ్ని ప్రమాదానికి కారణమైనటువంటి వివరాలు ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విడాకుల కోసం.. భర్త ఇంటి ముందు

# భార్య ఆందోళన



**కురవి, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** కట్టుకున్న భర్త కనుక అబండాలు వేస్తూ వేధింపులకు గురి చేస్తూ గత మూడు సంవత్సరాల నుండి పట్టించుకోకుండా తిరుగుతున్న సంఘటనపై భార్య ఆందోళన ఆదివారం కురవి మండలం రాజోలు గ్రామంలో బర్త ఇంటి ముందు బార్య ఆందోళన రాజోలు గ్రామానికి చెందిన గునుగంటి సురేందర్ అనే వ్యక్తి తో మానస అనే యువతికి మూడేండ్ల క్రితం వివాహం జరిగింది. వారి కాపురం మూడు నెలల పాటు సజావుగా సాగింది. అనంతరం అధిక కట్నం తేవాలంటూ మానస ను, భర్తతో పాటు అత్త, బాత్రూం లో సీసీ కెమెరాలు పెట్టి వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టారు. అత్తారింటి వేధింపులతో పాటు భర్త వేధింపులపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీస్ వారు కౌన్సిలింగ్ చేసినప్పటికి బర్త ప్రవర్తనలో మార్పు రావడం లేదని వివాహిత ఆవేదన వ్యక్తం చేసింది. తన వేధింపులు తాళలేక మానసికంగా, తట్టుకోలేకపోతున్నానని, ఇది వరకు ఆత్మహత్య ప్రయత్నం చేసానని, కానీ భర్త సురేందర్ పెద్ద మనుషుల్లో లేదా కోర్ట్ ద్వారా విడాకులు ఇవ్వను. ఆమె మానసికంగా అలానే చావాలి, ఇంకో పెళ్లిచేసుకోవద్దని అందరి ముందు చెప్పుకుంటూ మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నాడని తనతో కాపురం కష్టంగా ఉందని తనకు చట్టరీత్యా విడాకులు ఇప్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలని వివాహిత వేడుకున్నారు.

# వీఎంసీలో వంద కోట్ల కుంభకోణం




**విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (నిఘా న్యూస్):** జీవీఎంసీలో టిడీఆర్ ల పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. విశాఖ జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో 100 కోట్ల అక్రమ టిడీఆర్ లు పొందిన వారు ఇప్పుడు వాటిని దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు డి-పట్టా దేవస్థానం భూములకు వైసిపి హయాంలో అక్రమంగా ఎన్నో టిడీఆర్ లు ఇచ్చారని అక్రమ టీడీఅర్ ల ను రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళలతో మందుబాబుల అసభ్య ప్రవర్తన

- గోల్నాకలో జనవాసాల మధ్య అంబికా వైన్స్
- వైన్ షాప్ ముందు వాహనాల ఆక్రమ పార్కింగ్
- స్థానికుల రాక పోకలకు తీవ్ర ఇబ్బంది




**అంబర్‌పేట్, ఫిబ్రవరి 2(నిఘా న్యూస్):** జనవాసాలను అనుకుని ఏర్పాటు చేసిన గోల్నాక శ్రీ అంబికా వైన్స్ కారణంగా తాము పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానిక బస్తీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం 10గంటలను నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ వైన్ షాప్ పరిసరాల్లో మందుబాబులు గుంపులు గుంపులుగా నిలబడి ఉంటున్నారని, దీనివలన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వారంటున్నారు. పర్మిట్ రూంలో మద్యం సేవించాల్సిన వారు రోడ్లపై, చుట్టుపక్కల దుకాణాల అరుగుల మీద కూర్చుని మందు తాగుతున్నారని వారు గుర్తు చేశారు. అలాగే కొంతమంది మందుబాబులు చిత్తుగా మద్యం సేవించి మత్తులో రోడ్లపై ఒకరితో ఒకరు గొడవ పడుతూ నానా న్యూసెన్స్ సృష్టిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మందుబాబులు తమ వాహనాలను రోడ్లపై ఇష్టానుసారం పార్క్ చేస్తున్నారని, దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రధానంగా ఈ వైన్ షాప్ వద్ద జరుగుతున్న గొడవల కారణంగా మహిళలు ఈ దారిన రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని వారు అంటున్నారు. కొన్ని సందర్భాల్లో మద్యం మత్తులో మందుబాబులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీల అనుకొని వైన్ షాప్ ఏర్పాటుకు అనుమతించవద్దని గతంలో తాము పలుమార్లు కాచిగూడ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పలుమార్లు వైన్ షాప్ వద్ద మందుబాబుల ఆగడాలపై స్థానిక కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసు వాహనం వచ్చినప్పుడు వెళ్ళిపోతున్న మందుబాబులు తిరిగి మళ్లీ అదే న్యూసెన్స్ సృష్టిస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి జనవాసాలను అనుకుని ఏర్పాటు చేసిన గోల్నాక శ్రీ అంబికా వైన్స్ ను ఇక్కడి నుంచి తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com